RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 47 | శుక్రవారం, మార్చి 15, 2024 | పేజీలు : 4

## నకిలీ వైద్యుడి అరెస్టు

హైదరాబాద్: ఎలాంటి అర్హత లేకున్నా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యుడిని సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి ఇంజక్షన్లు, ట్యాబ్లెట్లు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, కరీంనగర్‌కు చెందిన రాజు గంగారాం అంకలాప్ నగరంలోని రామంతపూర్‌లో శ్రీ సాయి వెంకటేశ్వర క్లినిక్‌ను ఏర్పాటు చేశాడు. ముంబాయికి చెందిన సంస్థ నుంచి డిఎన్‌వైసి, పిజిడిఈఎంఎస్ చేసినట్లు పెట్టుకుని ఫిజీషియన్‌గా చేలామని అవుతున్నాడు. గతంలో నిందితుడు ఆయుర్వేదిక్, జనరల్ మెడిసిన్ క్లినిక్స్‌లో పనిచేయడంతో వైద్యం గురించి తెలుసుకున్నాడు. నిందితుడికి మెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకోలేదు.

## టీడీపీలో చేరిన కర్నూలు వైసీపీ ఎంపీ సంజీవ్‌కుమార్



అమరావతి : వైసీపీకి చెందిన కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ గురువారం ఉండవల్లిలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో టీడీపీ లో చేరారు. ఈ సందర్భంగా సంజీవ్ కుమార్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కర్నూల్ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే తాను టీడీపీలో చేరానని వెల్లడించారు. వైసీపీలో సామాజిక న్యాయం లేదని ఆయన విమర్శించారు. బీసీలకు తగిన ప్రాధాన్యత లేదని దుయ్యబట్టారు. తాను ఎలాంటి సీటు ఆశించకుండా భేషరతుగానే టీడీపీలో చేరానని స్పష్టం చేశారు. కర్నూలుకు తాగునీరు ఇవ్వలేనప్పుడు వైసీపీ లో ఎందుకని రాజీనామా చేసినట్లు వివరించారు.

## మమతా బెనర్జీకి... తీవ్ర గాయాలు



**న్యూఢిల్లీ మార్చి, 14 :** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రమాదానికి గురయ్యారు. ఆమె నుదిటిపై తీవ్ర గాయాలు అయ్యాయని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎక్స్ వేదికగా తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫోటోలను సైతం షేర్ చేసింది. ఆమె నుదుటిపై గాటు పడగా, ముఖంపై రక్తం కారుతున్నట్టుగా ఆ ఫోటోలో మనం గమనించవచ్చు. ఆమె ట్రెడ్‌మిల్‌పై వాకింగ్ చేస్తుండగా అదుపుతప్పి పడిపోయారని, దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలు అయ్యాయని, వెంటనే కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రికి ఆమెను తరలించడం జరిగిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. "మా చైర్‌పర్సన్ మమతా బెనర్జీకి పెద్ద గాయమైంది. ఆమె వెంటనే కోలుకోవాలని అందరూ ప్రార్థించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం" అని టీఎంసీ ఎక్స్‌లో పేర్కొంది. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.


## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి: మంత్రి తుమ్మల




**హైదరాబాద్ మార్చి, 14 ):** రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని పలు సర్వేలు చెబుతున్నాయని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటువేయాలని చెప్పారు. ముఖ్యంగా మల్కాజ్‌గిరి సీటును తిరిగి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. గత కేసీఆర్ ప్రభుత్వ నిరంకుశ వైఖరి వల్ల ట్రిపుల్ ఆర్ రోడ్డు, ఎలివేటెడ్ కారిడార్లు నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. గురువారం నాడు కూకట్‌పల్లి భగత్ సింగ్ నగర్‌లో సర్దార్ భగత్ సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.... బానిస బతుకులు మనకు అక్కర్లేదంటూ ఉరి కొయ్యలని ముద్దాడి మనకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను భగత్ సింగ్ సాధించారని తెలిపారు. స్వాతంత్ర భారతం నేడు అగ్ర దేశాల సరసన నిలబడి అగ్రస్థాయికి చేరుకుంటుందని తెలిపారు. భారత దేశానికి ఉన్న అపారమైన శక్తి, భారత దేశ యువత అని తెలిపారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత నిర్వేదంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ నూతనోత్సాహంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని అన్నారు. అధికారం చేపట్టిన తమ ప్రభుత్వానికి అవాంతరాలు, ఆటంకాలు, కష్టాలు, అప్పులు, బాధ్యతలు, అవసరాలు ఉన్నాయన్నారు. అన్నింటినీ అధిగమించి సక్రమంగా, సగర్వంగా ఇచ్చిన హామీలు, అభివృద్ధి చేస్తామన్నా విశ్వాసం తమకు ఉందని చెప్పారు.

## పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా పవన్‌కల్యాణ్ పోటీ

అమరావతి : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిఠాపురం జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటి చేయనున్నారు. ఈ మేరకు ఆయనే గురువారం స్వయంగా ప్రకటించారు. ప్రస్తుతానికి ఎంపీగా పోటీ చేసే ఆలోచనలో లేనని , ఎమ్మెల్యేగానే పోటీ చేయాలని ఉందని స్పష్టం చేశారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలంలో జనసేన ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన పవన్‌కల్యాణ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంపీగా పోటీ చేసే అంశంపై పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానని వెల్లడించారు. గతంలో గాజువాక, భీమావరం నుంచి పోటీ చేశానని తెలిపారు. పాపం జగన్‌కు గ్రాఫిక్స్ పై అవగాహన లేదని దుయ్యబట్టారు. నన్ను కొట్టే ప్రతి దెబ్బను వాడుకుని ఎదుగుతానని అన్నారు. ఈ ఎన్నికల్లో గెలిచి తీరుతున్నామని ధీమాను వ్యక్తం చేశారు. జగన్ పోతాడు.. వైసీపీ పోతుంది. పొత్తులు గెలుస్తాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను చీకటి నుంచి వెలుగులోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చాక ప్రతినెలా జనవాణి నిర్వహిస్తామని ప్రకటించారు.



## రాజ్యాంగాన్ని మార్చడానికి 400 ఎంపి స్థానాలు ఆశిస్తోన్న బిజేపి



ముంబై: రాజ్యాంగాన్ని తనకు అనుకూలంగా మార్చివేయడానికి లోక్‌సభ ఎన్నికల్లో 400 కు మించి ఎంపిస్థానాలను గెలవాలని బీజేపీ కోరుకుంటోందని శివసేన (యుబిటి) నేత ఉద్ధవ్ థాకరే గురువారం ధ్వజమెత్తారు. మహారాష్ట్ర రత్నగిరి జిల్లా గుహగర్‌లో ర్యాలీని ఉద్దేశిస్తూ థాకరే ప్రసంగించారు. వన్ నేషన్, వన్ ఎలెక్షన్ ప్రతిపాదనపై మాట్లాడుతూ ఇది నియంతృత్వానికి దారి తీసే చర్యగా విమర్శించారు. లోక్‌సభ లోని మొత్తం 543 స్థానాలకు 400 కు మించి స్థానాలను బీజేపీ కోరుకోవడంలో బీజేపీ అసలు ఆంతర్యాన్ని వివరిస్తూ తన ప్లాను ప్రకారం రాజ్యాంగం మారుస్తున్నప్పుడు వ్యతిరేకించే గొంతుకలు ఉండరాదన్నదే వారి లక్షంగా విమర్శించారు. ఇటీవల పార్లమెంట్‌లో వందకు మించి పార్లమెంట్ సభ్యులు సస్పెండ్ అయ్యారని, ఆ సమయంలో అనేక ముఖ్యమైన బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం పొందాయని ఉదహరించారు. అటల్ బిహారీ వాజ్‌పాయ్, అద్వానీ కాలం నాటి బీజేపీకి ఇప్పటి బీజేపీ దూరమైందని థాకరే విమర్శించారు.

## రాజ్యసభ ఎంపీగా సుధామూర్తి ప్రమాణ స్వీకారం



న్యూఢిల్లీ : రాజ్యసభ ఎంపీగా ఇన్ఫోసిస్ వ్యవస్థాపడు ఎన్ఆర్ నారాయణ మూర్తి భార్య సుధామూర్తి గురువారం ప్రమాణం చేశారు. ఆమె భర్త నారాయణమూర్తి సమక్షం లోనే ఈ కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తన ఛాంబర్లో ఆమెతో ప్రమాణం చేయించారు. సభా నాయకుడు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 73 ఏళ్ల సుధామూర్తి గతంలో ఇన్ఫోసిస్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆమె పిల్లల కోసం అనేక పుస్తకాలు రాశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గత శుక్రవారం రాజ్యసభకు సుధామూర్తిని నామినేట్ చేసింది. కన్నడ, ఆంగ్ల సాహిత్యంలో ఆమె అనేక రచనలు చేశారు. సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం, పద్మశ్రీ (2008), పద్మభూషణ్ (2023) అవార్డులను అందుకున్నారు. టెల్కో కంపెనీలో పనిచేసిన తొలి మహిళా ఇంజినీర్‌గా సుధామూర్తికి ప్రత్యేక గుర్తింపు ఉంది. రూ. 10 వేల పెట్టుబడితో ప్రారంభించిన ఇన్ఫోసిస్ కంపెనీ ప్రస్తుతం 80 బిలియన్ డాలర్ల కంపెనీగా అవతరించింది. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ భార్య అయిన అక్షత సుధామూర్తి కుమార్తె అన్నది తెలిసిందే

## డికెను కలిసిన మల్లారెడ్డి



**హైదరాబాద్ మార్చి, 14 :** కర్నాటక కాంగ్రెస్ నేత డికె శివ కుమార్‌తో మల్లారెడ్డి, భద్రారెడ్డి భేటీ ఆసక్తిగా మారింది. బెంగళూరులో డికెను మల్లారెడ్డి, ఆయన కుమారుడు భద్రారెడ్డి కలిశారు. ఇటీవల ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా మల్లారెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. మల్లారెడ్డి కాంగ్రెస్‌లో చేరితే మల్కాజ్‌గిరి పార్లమెంట్ టికెట్ తన కుమారుడికి ఇవ్వాల్సిందిగా కోరుతున్నట్టు సమాచారం. బిఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు మల్లారెడ్డి కుమారుడికి ఆ పార్టీ అధినేత కెసిఆర్ ఆఫర్ ఇచ్చినట్టు సమాచారం. ఐనా తండ్రీ కుమారులు కాంగ్రెస్ అగ్రనేత డికె శివ కుమార్‌ను కలవడం రాజకీయంగా కలకలం సృష్టిస్తోంది.

## టెట్ నోటిఫికేషన్ విడుదల మే 20 నుంచి ఎగ్జామ్స్

**హైదరాబాద్ మార్చి, 14 :** తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్, టెట్ చైర్మన్ తెలిపారు. ఈ నెల 27 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 10 వరకు టెట్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఇదిలా ఉండగా.. ఇవాళ టెట్ నిర్వహించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు విద్యా శాఖ కమిషనర్‌కు సర్కారు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 3 లక్షల మంది అభ్యర్థులకు డీఎస్సీ రాసే అవకాశం దక్కనుంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల 11,062 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ-2024ను ప్రకటించిన విషయం తెలిసిందే.

## నేడు మల్కాజిగిరిలో ప్రధాని మోదీ... రోడ్ షో

**హైదరాబాద్ మార్చి, 14 :** పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బీజేపీ దూకుడు పెంచింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ (పీఎం మోదీ) శుక్రవారం హైదరాబాద్ రానున్నారు. పదిరోజుల వ్యవధిలో మోడీ రెండోసారి రాష్ట్రానికి వస్తున్నారు. మూడు రోజుల పాటు ఆయన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. శుక్రవారం సాయంత్రం మల్కాజిగిరిలో ప్రధాని మోదీ రోడ్ షో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేతలు రోడ్ షోకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మిర్జాలగూడ నుంచి మల్కాజిగిరి వరకు మోదీ రోడ్ షో జరగనుంది. మల్కాజిగిరి లోక్‌సభ ప్రాంతంలో 1.3 కి.మీ. ప్రధాని రోడ్ షో నిర్వహించనున్నారు. అలాగే 16న (శనివారం) నాగర్ కర్నూల్ లో మోదీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. 18న జగిత్యాలలో జరిగే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాగర్‌కర్నూల్ పర్యటన ఖరారైంది. లోక్



సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని శనివారం (16) నాగర్ కర్నూల్ కు వస్తున్నారు. దాంతో వెలమ సంగం కల్యాణ మండపం పక్కన భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ మేరకు బుధవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ బీజేపీ నేతల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది.

## సీఏఏను ఎన్నటికీ... వెనక్కి తీసుకోబోం

### అమిత్ షా స్పష్టీకరణ

**న్యూఢిల్లీ మార్చి, 14 :** సార్వత్రిక ఎన్నికల వేళ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రతిపక్ష కాంగ్రెస్ సహా తృణమూల్, సీపీఐ, ఆప్, సమాజ్‌వాదీ, డీఎంకే తదితర పార్టీలు ఈ చట్టాన్ని ఇప్పటికే వ్యతిరేకించాయి. తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేయబోమని స్పష్టం చేస్తున్నాయి. ఈ చట్టాన్ని కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్లు కూడా వెల్లువెత్తున్నాయి. పలువురు ఈ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో సీఏఏ అంశంపై కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా తాజాగా స్పందించారు. సీఏఏను ఎప్పటికీ వెనక్కి తీసుకోబోమని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రకారం ఏ దేశ ముస్లింలైనా భారతీయ పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అయితే, ఇప్పుడు తీసుకొచ్చిన చట్టం మాత్రం విభజన కారణంగా పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మతపరమైన హింసను ఎదుర్కొంటూ భారతదేశానికి రావాలని నిర్ణయించుకున్న ముస్లిమేతర మైనారిటీల కోసం ఉద్దేశించినదని షా వెల్లడించారు.



## సంపాదకీయం

# ఆ చమురు, గ్యాస్ మన హక్కు

కాకినాడ సముద్ర తీరానికి ముప్పై కి.మీ దూరంలో కేంద్రం ప్రభుత్వరంగ చమురు, సహజ వాయువు సంస్థ ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో కృషా–గోదావరి బేసిన్ డీప్ వాటర్ బ్లాక్ డి–5 నుంచి 2024, జనవరి 7న చమురు ఉత్పత్తి ప్రారంభమవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ కేజీ డి–6 బావి చెంత దేశం మొత్తం ఉత్పత్తిలో ఇది 7 శాతం చమురు, 7శాతం గ్యాస్ అని... 2024 జూన్ నాటికి ఇది చమురు 11శాతం, గ్యాస్ 15శాతం స్థాయికి చేరి రోజుకు 45,000 బ్యారల్స్ చమురు, పది మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల గ్యాస్ వాణిజ్య ఉత్పత్తి జరిగి భారత ఇంధన రంగంలో ఇది అద్భుతమైన మైలురాయిగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. కృష్ణా–గోదావరి నదుల మధ్య ప్రాంతంలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల భూ ఉపరితలంలో 28 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలోనూ, ఈ ప్రాంత సముద్ర తీరం వెంబడి ప్రాదేశిక జలాల్లో 24 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలోనూ అపార చమురు, గ్యాస్ నిక్షేపాలు విస్తరించి ఉన్నాయి. ప్రభుత్వ రంగంలోని చమురు, సహజవాయు సంస్థ (ఓఎన్‌జీసీ) దశాబ్దాల పరిశోధనల కృషి ఫలితంగా ఈ ప్రాంతంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు బయటపడ్డాయి. 1978 సంవత్సరంలో మొదటి బావిని తవ్వి గ్యాస్ కనుగొన్నారు. 2001–2002లో కేజీ బేసిన్ నుంచి ఓఎన్‌జీసీ 2.82 లక్షల టన్నుల ఆయిల్, 1.769 బిలియన్ క్యూబిక్ లీటర్ల గ్యాస్ అమ్మకం చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 550 కోట్ల రూపాయల రాయల్టీ చెల్లించింది. అయితే 1997లో కేంద్రం నూతన అన్వేషణ, లైసెన్సింగ్ విధానం (ఎన్ఇఎల్‌పి) ప్రవేశపెట్టిన ఫలితంగా ప్రభుత్వ అజమాయిషీ నుంచి 1990 దశకం నాటికి చమురు, గ్యాస్ నిక్షేపాల అన్వేషణలో ప్రైవేటురంగ సంస్థలు హక్కు సంపాదించాయి. ఈ విధానంలో వేలంపాటలో 161 బావులపై ఒప్పందాలు జరిగాయి. ఈ వేలంపాటలో ఓఎన్‌జీసీ, ఆర్ఐఎల్ సమాన విస్తీర్ణంలో వాటా లభించినా ఉత్పత్తులు అత్యధికంగా ఆర్ఐఎల్ ఖాతాకు దక్కడం ఒకింత అనుమానం, ఆశ్చర్యం కలిగించేదే. ధరల నిర్ణయంలోను రిలయన్స్‌దే పైచేయిగా మారింది. ఆ విధంగా దేశంలో, రాష్ట్రంలో చమురు, గ్యాస్ నిక్షేపాలపై రిలయన్స్ ఏకఛత్రాధిపత్యం సాధించింది. ప్రభుత్వరంగ సంస్థ ఓఎన్‌జీసీ మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి గత ఐదేళ్లలో రెండు వేల కోట్ల రూపాయలను, 2023%--%24లో 305.62 కోట్లు, 134.34 కోట్ల రూపాయలు రాయల్టీ, టాక్స్ రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించింది. సముద్ర గర్భం నుంచి వెలికి తీసిన గ్యాస్, చమురు లాభాలు మొత్తం కేంద్రానికే దఖలౌతున్నాయి. ప్రభుత్వం రిలయన్స్ ఇండస్ట్రీస్ మధ్య కుదిరిన ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్టులో అవకతవకలు జరిగాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రిపోర్ట్ తప్పుపట్టింది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ సైతం దీనిని అంగీకరించింది. కాంట్రాక్టర్‌కు తొంభై శాతం లాభాలు ముడుతుండగా, ప్రభుత్వానికి కేవలం పది శాతమే దక్కుతున్నాయి. గుజరాత్ పెట్రోలియం–సహజ వాయువు సంస్థను నెలకొల్పిన గుజరాత్ ప్రభుత్వం రెండు లక్షల కోట్ల విలువైన కేజీ బేసిన్ గ్యాస్‌ను స్వంతం చేసుకుని లాభాలు గడించి, ఆ ప్రాంత పారిశ్రామిక, వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతున్నది. కానీ మన రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు ముడుచుకుని చోద్యం చూస్తున్నాయి. ఎన్ఇఆర్‌ఎల్‌పి ప్రకారం సముద్ర గర్భంలోనూ, భూ ఉపరితలంలోనూ ప్రైవేటు కార్పొరేట్ సంస్థలు తాము పెట్టిన పెట్టుబడిని లాభాలతో సహా త్వరగా రాబట్టుకోవడానికి వీలుగా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఉత్పత్తుల ధర నిర్ణయించే వెసులుబాటును పొందాయి. గ్యాస్‌ను అన్వేషించి వెలికి తీయడానికి అయ్యే ఖర్చు, పెట్టుబడిపై రికవరీ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను, రాయల్టీల మొత్తం ఖర్చుగా భావించి గ్యాస్‌ను అమ్మగా వచ్చిన పైకం నుంచి ఈ ఖర్చును మినహాయిస్తే మిగిలే లాభం నుంచి కేంద్ర ప్రభుత్వం తన వాటాను నగదు లేదా వస్తు రూపంలో తీసుకోవచ్చు. ప్రముఖ ఆర్థికవేత్త, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రంగరాజన్ నేతృత్వంలో ఏర్పడిన 12వ ఆర్థిక సంఘం ఏ ప్రాంతంలో లభ్యమయ్యే సహజవనరులపై ఆ ప్రాంతానికి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించింది. ఈ నివేదిక ననుసరించి కృష్ణా–గోదావరి బేసిన్ గ్యాస్, చమురు లాభాల్లో ఆంధ్రప్రదేశ్‌కి ఏభై శాతం ఇవ్వడం ద్వారా విభజన గాయాల నుంచి రాష్ట్రానికి ఉపశమనం లభిస్తుంది. సిబ్బంది జీతాలకు, తెచ్చిన ఋణాలపై వడ్డీల చెల్లింపుల కోసం మళ్ళీ అధిక వడ్డీలకు ఋణాలు తెస్తూ అభివృద్ధి ఊసే లేని ఆర్థిక సంక్షోభంలో రాష్ట్ర భవిష్యత్తు నాశనమయింది. కనీస మౌలిక సదుపాయాలకూ వ్యయం చేయలేని దుస్థితిలో చివరకు ఆర్థిక ఎమర్జెన్సీ దిశగా రాష్ట్ర పరిస్థితులు మారుతున్నాయి. ఈ దుస్థితి నుంచి బయటపడాలంటే రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. మన రాష్ట్రంలో లభ్యమౌతున్న గ్యాస్, చమురు సహజ సంపదలో రాష్ట్రం వాటాకై డిమాండ్ చేసి సాధించడం ద్వారా అనేక విధాల రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పయనింపజేయవచ్చు. 12వ ఆర్థిక సంఘం సిఫార్సు అమలైతే కేంద్రానికి రాయల్టీగా లభిస్తున్న నేచురల్ గ్యాస్‌లో ఏభై శాతం స్థానిక రాష్ట్రంగా మనకు దక్కాలి.

# రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా జరిగేలా చర్యలు

## - మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం





**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త):** రానున్న పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు బాధ్యతతో పనిచేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వే లెన్స్, వీడియో, వీవింగ్ సర్వే లెన్స్, ఎం సి సి బృందాలతో డి సి ఓ రాజేందర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కేశు రామ్, డిస్ట్రిక్ట్ లెవెల్ మాస్టర్ ట్రైనర్ తిరుమలేష్, ఈ డిస్టిక్ మేనేజర్ భాను ప్రకాష్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అంశాలపై పూర్తి అవగాహన కల్పించారు. అధికారులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు, ఫ్లయింగ్ స్క్వాడ్ సర్వే లెన్స్, టీంల బాధ్యతలను తెలియజేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రతి ఒక్కరికి సమానంగా వర్తిస్తుందని సూచించారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు 24/7 పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు. అక్రమంగా డబ్బు, మద్యం సరఫరా, ప్రలోభాలు, బహుమతులు ఇవ్వడం లాంటి వాటిని పకడ్బందీగా నియంత్రించాలని ఆదేశించారు. ఎన్నికలలో అభ్యర్థుల ఖర్చుల తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. ఏవైనా అనుమానాలు ఇబ్బందులు తెలియని విషయాలు ఉంటే సంబంధిత ఉన్నత అధికారులను అడిగి తెలుసుకోవాల్సిందిగా తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యాత్మక ప్రదేశాలలో ప్రత్యేకమైన ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు సకాలంలో చేరుకోలేని పక్షంలో కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో స్టాటిస్టిక్ సర్వేలెన్సులు చురుగ్గా పనిచేయాలని ఎక్కడైనా 50వేల రూపాయల కంటే అధికంగా నగదు రవాణా చేస్తున్నట్టు గుర్తిస్తే ఎలాంటి ఆధారాలు లేకుండా సందేహాస్పదంగా ఉంటే దానిని సీజ్ చేసి ట్రెజరీలో డిపాజిట్ చేయాలి అని అన్నారు. సీజ్ చేసిన నగదు వివరాలు కలెక్టరేట్లో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి చూపించి తమ నగదును విడుదల చేసుకోవచ్చు అని తెలిపారు. 10 లక్షల రూపాయల వరకు ఆధారాలు లేకపోతే ఇన్ కమ్ టాక్స్ వారికి సమాచారం అందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ప్రతిరోజు నివేదికలు పంపే విధంగా ఎం సి సి నోడల్ అధికారి, అభ్యర్థులు ఖరారు అయిన తర్వాత ఖర్చులకు సంబంధించిన వివరాలు రిపోర్టులను ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి, రాజకీయ ప్రకటనలకు సంబంధించిన మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ సోషల్ మీడియా ద్వారా నిర్వర్తించే విధులు సంబంధిత అధికారులు గమనించాలన్నారు. సి విజిల్ యాప్ ఈ ఎస్ఎంఎస్ యాప్ లను ఇన్స్టాల్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా సమస్యలు ఉంటే సి విజిల్ యాప్, %జూమీ% యాప్ ల ద్వారా ఫిర్యాదు చేసే విధంగా ఎన్నికల కమిషన్ యాప్ రూపొందించిందని తెలిపారు. సి విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించే సమయంలో ఆధారాలు సేకరించాలన్నారు. సీజ్ చేసిన డబ్బులు వస్తువులను %జూమీ% యాప్ లో ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలి అన్నారు. సీజ్ చేసే సమయంలో వీడియోగ్రఫీ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాలలో కంప్లైంట్ ను చేదించి సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది అని అన్నారు. ఎన్నికలలో అక్రమాల నివారణకు ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి, టీంలు కృషి చేయాలని తెలిపారు. ఎఫ్ ఎస్ టి, వి ఎస్ టి, ఎస్ ఎస్ టి, వి వి టి, ఎం సి సి టీంలకు వాహనాలకు జిపిఎస్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల సమయంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనిచేయాలన్నారు. జిల్లాలో కంట్రోల్ రూమ్ 24/7 నిర్వహించాలని ఫిర్యాదులు సమస్యలు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటినుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని కోడ్ అమలులోకి రాగానే నిర్వహించే విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి విధులు ఏర్పాట్లు తదితర విషయాలపై జిల్లా ట్రైనర్ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీం అధికారులు, వ్యయ పరిశీలకులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ధరణితో రైతులను నష్టపోయారు

**శామీర్ పేట, (గరుడ వార్త) :** రాష్ట్రంలో గత ప్రభుత్వం అధికారికంగా భూ కుంభకోణానికి పాల్పడిందంటూ ధరణి కమిటీ చైర్మన్ కోదండ రెడ్డి ఆరోపించారు. గురువారం శామీర్ పేట మండలం బొమ్మరాజుపేటలో ధరణితో మోసపోయిన రైతులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ధరణి కమిటీ చైర్మన్ కోదండ రెడ్డి, లీగల్ అడ్వైసర్ సునీల్ మాట్లాడుతూ ధరణిలో సాంకేతిక లోపాలను అడ్డుపెట్టుకొని బొమ్మరాసిపేట రైతులను చాలా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణితో ఎంతో మంది రైతులు మోసపోయారని చెప్పారు. ధరణి కమిటీ ఏర్పాటు చేశామని ధరణి పోర్టల్ వ్యవస్థను సరి చేసి రైతులకు న్యాయం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధారిణి పోర్టల్ వల్ల చాలా మంది రైతులు మోసపోయారని, ధరణి వల్ల గత ప్రభుత్వ నాయకులే బాగుపడ్డారని తెలిపారు. ధరణి లోపాలను ఆదిగమించడానికి ధరణి పోర్టల్ నూతన కమిటీని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన సూచనల మేరకు ఏర్పాటు చేశామని చెప్పారు. ధరణి వల్ల మోసపోయిన సన్నకారు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల అందులోని లోపాలను వెలికి తీసి సాఫ్ట్వేర్ సమస్యలు, నూతన చట్టాలను ఏర్పాటు చేసి రైతులకు న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




# సింజీన్, బయోకాన్ ఫౌండేషన్ సౌజన్యంతో విద్యార్థుల కొరకు స్మార్ట్ క్లాస్ రూమ్




**శామీర్ పేట, (గరుడ వార్త):** సింజీన్, బయోకాన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్ ను ప్రారంభించారు. గురువారం మండల కేంద్రం శామీర్ పేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర పరిశోధన, అభివృద్ధి మరియు తయారీ సేవల సంస్థ(సింజీన్) ఇంటర్నేషనల్, బయోకాన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో నూతన స్మార్ట్ క్లాస్ రూమ్ ను ప్రారంభించారు. 2023లో అత్యంత విజయవంతమైన 'సింక్విజిటివ్' సైన్స్ క్విజ్‌లో హైదరాబాద్ ప్రాంత విజేతగా శామీర్‌పేట పాఠశాలకు చెందిన విద్యార్థి గెలుపొంది ఈ క్లాస్ రూమ్ ను పొందారని తెలిపారు. సింజీన్ వద్ద సైట్ హెడ్ ఈడె ప్రసాద్ మాట్లాడుతూ ఇంటరాక్టివ్ టెక్నాలజీ, ఎడ్యుకేషనల్ సాఫ్ట్వేర్, క్లాస్‌రూమ్ ఫర్నిచర్, ఫిక్చర్‌లు, సపోర్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో కూడిన ఈ క్లాస్‌రూమ్‌లు ఉపాధ్యాయులకు తగిన అవకాశాలను కల్పించటం జరుగుతుందన్నారు. విద్యార్థులకు అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడం చేయనున్నట్లు చెప్పారు. వీటితో సుమారు 200 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో సింజీన్, బయోకాన్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



# జమిలీ ఎన్నికల నిర్వహణపై కోవింద్ కమిటీ ఏకాభిప్రాయం



న్యూఢిల్లీ: జమిలీ ఎన్నికల నిర్వహణపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ కొన్ని ప్రతిపాదనలు చేసింది. ఇవాళ ఆ రిపోర్టును రాష్ట్రపతి ముర్ముకు అందజేశారు. ఆ రిపోర్టులో ఏముందో ఓసారి పరిశీలిద్దాం. మొదటగా లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత వంద రోజుల వ్యవధిలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని రామ్‌నాథ్ కోవింద్ ప్యానెల్ తెలిపింది. ఒకవేళ హంగ్ ఏర్పడితే అప్పుడు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత మరో అయిదేళ్లకు చెందిన తాజా ఎన్నికలను మళ్లీ నిర్వహించాల్సి ఉంటుందని కోవింద్ ప్యానెల్ రిపోర్టులో పేర్కొన్నది. తొలిసారి జరిగే జమిలీ ఎన్నికలకు, అన్ని రాష్ట్రాల అసెంబ్లీల కాల పరిమితి లోక్‌సభ ఎన్నికల తేదీ నాటికే ముగుస్తుందని రిపోర్టులో తెలిపారు. జమిలీ ఎన్నికలు నిర్వహించాలని కమిటీ ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు రిపోర్టులో తెలిపారు. 2029 నుంచే జమిలీ ఎన్నికలు నిర్వహించాలని రిపోర్టులో కోరారు. 18626 పేజీలతో రిపోర్టును తయారు చేశారు. జమిలీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తు ప్లానింగ్ ఉండాలని, ఎన్నికలకు అవసరమైన ఎక్విప్మెంట్స్, సిబ్బంది, భద్రతా బలగాలను మోహరించాల్సి ఉంటుందని రిపోర్టులో పేర్కొన్నారు. సింగిల్ ఎన్నికల రోల్‌ను ఈసీ తయారు చేయాల్సి ఉంటుంది. ఆయా రాష్ట్రాల అధికారులతో కలిసి లోక్‌సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికలకు చెందిన ఓటరు ఐడీ కార్డులను రూపొందించాల్సి ఉంటుంది. జమిలీ ఎన్నికల నిర్వహణ ద్వారా పారదర్శకత పెరుగుతుందని కోవింద్ ప్యానెల్ రిపోర్టులో చెప్పింది. వన్ నేషన్ వన్ ఎలక్షన్ ద్వారా భారతీయుల ఆశలు నిజం అవుతాయని పేర్కొన్నారు. జమిలీతో పరిపాలనా వ్యవస్థ వృద్ధి చెందుతుందని రిపోర్టులో తెలిపారు.

## ఖర్గే: అయ్యయ్యో.. జేబులు ఖాళీ ఆయెనే!



న్యూఢిల్లీ: పాపం కాంగ్రెస్ పార్టీ డబ్బుల్లేక ఇబ్బంది పడుతోందట! ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే స్వయంగా ఈ మాట చెప్పారు. లోక్ సభ ఎన్నికల వేళ తమ పార్టీ నిధులు లేక అల్లాడుతోందనీ, పార్టీ బ్యాంక్ ఖాతాలను అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి స్తంభింపచేసిందని ఆయన ఆరోపించారు. ప్రజలు విరాళాలుగా ఇచ్చిన సొమ్మును ఫ్రీజ్ చేయడంతో తమ వద్ద ఖర్చు పెట్టడానికి డబ్బు లేదని ఆయన వాపోయారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రజలే ముందుకు రావాలని, కాంగ్రెస్ ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# సుప్రీం తీర్పుతో వ్యవస్థలు మారేనా...?




ఈ దేశంలో వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించడం గురించి ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడడం చెప్పుకోదగ్గ విషయమే. చట్టసభల్లో ఓటు వేసేందుకు, ప్రసంగించేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు ముడుపులు తీసుకుంటే వారిపై అవినీతి నిరోధక చట్టం క్రింద చర్యలు తీసుకోవాల్సిందేనని సుప్రీంకోర్టు సోమవారం వెలువరించిన తీర్పు వెలువడిన క్షణాల్లోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ హర్షం ప్రకటించారు. ఈ తీర్పు రాజకీయాలను అవినీతి నుంచి ప్రక్షాళనం చేసేందుకు, వ్యవస్థలపై ప్రజలకు ప్రగాఢమైన నమ్మకాన్ని కలుగచేసేందుకు దారితీస్తుందని మోదీ అన్నారు. చట్టసభల్లో ఓటింగ్ చేసేందుకు సభ్యులు ముడుపులు తీసుకునే విషయంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వెనుక మూడు దశాబ్దాల చరిత్ర ఉన్నది. 1993 జూలైలో పీవీ ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు వామపక్షాలకు బీజేపీ కూడా మద్దతు నిచ్చింది. తమ మధ్య సైద్ధాంతిక విభేదాలు వారి లక్ష్యానికి అడ్డు రాలేదు.

ప్రధానమంత్రి కావాలన్న ఆకాంక్షతో ఉన్న కాంగ్రెస్ నేత అర్జున్ సింగ్‌తో పాటు పలువురు పీవీ ప్రభుత్వం పడిపోయేందుకు తెరవెనుక తమ వంతు ప్రయత్నాలు చేశారు. అంతర్గత, బహిర్గత ప్రత్యర్థుల మధ్య చివరకు అవిశ్వాస తీర్మానం వీగిపోయి పీవీ ప్రభుత్వం 14 ఓట్లతో గట్టెక్కింది. జనతాదళ్ నుంచి రాంలఖన్ యాదవ్ నేతృత్వంలో విడిపోయిన ఏడుగురు సభ్యులతో పాటు నలుగురు జేఎంఎం సభ్యులు మద్దతు నిచ్చారు. ములాయం వర్గానికి చెందిన ముగ్గురు ఎంపీలు, బిఎస్‌పికి చెందిన ముగ్గురు ఎంపీలు గైరుహాజరయ్యారు. జనతాదళ్ (ఏ) నేత అజిత్‌సింగ్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. అజిత్‌సింగ్‌కు ఆ తర్వాత మంత్రిపదవి దక్కింది. నిజానికి జేఎంఎం సభ్యులు ఓటు వేయకపోయినా పీవీ ప్రభుత్వం గట్టెక్కేది. ఎందుకంటే, ములాయంసింగ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్‌లతో పాటు కాన్షీరామ్ కూడా పీవీకి మద్దతు నిచ్చారు. ఈ అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చకు పీవీ జవాబిస్తూ జార?ండ్ ప్రాంతానికి స్వతంత్ర ప్రతిపత్తిని కల్పిస్తామని హామీ ఇవ్వడంతో జేఎంఎం సభ్యులు అవిశ్వాస తీర్మానాన్ని వ్యతిరేకించారు. పీవీ హామీతోనే వారు సరిపెట్టుకుంటే బాగుండేది కాని ప్రభుత్వాన్ని కాపాడాలనుకున్న పి.వి. శ్రేయోభిలాషుల నుంచి ముడుపులను కూడా రాబట్టినట్లు ప్రచారం జరిగింది. 'వారికి ఒక్క పైసా కూడా ఇవ్వకండి అని ప్రధానమంత్రి చెప్పినప్పటికీ మా భయం మాది' అని పీవీ శ్రేయోభిలాషి ఒకరు వెల్లడించారు. పీవీ మూడు అవిశ్వాస తీర్మానాల నుంచి గట్టెక్కారు కాని ఏ సందర్భంలోనూ ఎంపీలను ప్రలోభపెట్టినట్లు ఆరోపణలు రాలేదు. జేఎంఎం ఎంపీలు పీవీ సర్కార్‌కు మద్దతు ప్రకటించిన తర్వాత దాదాపు మూడేళ్ల పాటు ఈ విషయాన్ని పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నికలు సమీపిస్తుండగా, రాష్ట్రీయ ముక్తి మోర్చా అనే సంస్థకు చెందిన రవీంద్రకుమార్ పిటిషన్ దాఖలు చేయడం, పీవీ 1996 మే 24న గద్దె దిగగానే జేఎంఎం కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయమని సీబీఐని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశించిన అయిదు నెలల్లోనే సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసి పీవీని ఏ%--%వన్ నిందితుడుగా చేర్చడం, బీజేపీలో చేరిన జేఎంఎం సభ్యుడు శైలేంద్ర మహతో తనకు పీవీ ముడుపులు చెల్లించారని ఆరోపించి అప్రూవర్‌గా మారడం వంటి పరిణామాలు వెనువెంటనే జరిగాయి. దర్యాప్తు పూర్తిగా శైలేంద్ర మహతో ప్రకటనపై ఆధారపడి జరిగినట్లు, ఆయన రకరకాల ప్రకటనలు చేసినట్లు ఆనాటి ఉదంతాలు అధ్యయనం చేసిన వారికి అర్థమవుతుంది. ఇదే అభిప్రాయంతో అప్పటి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ సోంధీ, పీవీని నిర్దోషిగా ప్రకటించారు. పీవీ నేరుగా ఎంపీలకు ముడుపులు ఇచ్చినట్లు ఎక్కడా రుజువులు లేవని ఆయన తన తీర్పులో ప్రకటించారు. హర్షద్ మెహతా అనే స్టాక్ బ్రోకర్ పీవీకి రూ. 1 కోటి చెల్లించినందువల్ల సీబీఐతో విచారణ జరిపించాలని జనహిత్ అనే సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు కూడా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటాచలయ్య ఆ పిటిషన్‌ను కొట్టి వేశారు. సుప్రీంకోర్టును రాజకీయాలకు వేదిక చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. పీవీపై వచ్చిన అనేక ఆరోపణలు, కేసుల నుంచి ఆయన నిర్దోషిగా బయటపడ్డప్పటికీ, వాటి వెనుక రాజకీయ కుతంత్రాలు ఎన్ని ఉన్నప్పటికీ, జేఎంఎం కేసులో 1998లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయ అవినీతికి సంబంధించి న్యాయవ్యవస్థ తీరుతెన్నులనే ప్రశ్నార్థకం చేసిందని చెప్పక తప్పదు. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసిన ఎంపీలపై వచ్చిన అవినీతి నేరారోపణలపై రాజ్యాంగంలోని అధికరణ 105(2) ప్రకారం చర్యలు తీసుకోవడానికి వీలు లేదని సుప్రీంకోర్టు భావించింది. సభ్యులు పార్లమెంట్‌లో చేసిన పనులన్నీ ఈ అధికరణ క్రింద వస్తాయని ప్రముఖ న్యాయవాది పావని పరమేశ్వరరావు చేసిన వాదనను సుప్రీం మెజారిటీ బెంచ్ ఆమోదించింది. ఎంపీలు స్వేచ్ఛగా వ్యవహరించేందుకు వీలుగా రూపొందించిన ఈ అధికరణను పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలకూ, ఓటింగ్‌కూ వర్తింపచేయవచ్చు కాని ముడుపులు స్వీకరించినా, ఘోరమైన నేరాలకు పాల్పడినా వర్తింపచేయడం సరైనదేనా అన్న ప్రశ్నలకు జవాబు లేకపోవడంతో నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి సవాలుగా నిలిచింది. దాదాపు 26 సంవత్సరాల తర్వాత సుప్రీంకోర్టు మళ్లీ తన తీర్పును తానే తిరగరాయడం చరిత్రాత్మకం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఇదే ఉద్దేశంతో సుప్రీం తాజా తీర్పును స్వాగతించి ఉంటారు. కాని సరిగ్గా 20 రోజుల క్రితం ఇదే సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల పేరుతో రాజకీయ పార్టీలు రహస్య విరాళాలు సేకరించడం రాజ్యాంగ వ్యతిరేకమని, అవి కూడా కార్పొరేట్ సంస్థల నుంచి ముడుపులు స్వీకరించడంతో సమానమని తీర్పు నిచ్చినప్పుడు మాత్రం ప్రధానమంత్రి ఏ మాత్రం స్పందించలేదు. బహుశా ఎన్నికల బాండ్ల విషయంలో ఉన్నత న్యాయస్థానం తీర్పుతో ఆయన ఏకీభవించడం లేదని అనుకోవాల్సి వస్తుంది. సుప్రీంకోర్టు ఆదేశించినట్లు ఎన్నికల బాండ్ల వివరాలు చెప్పేందుకు కూడా స్టేట్ బ్యాంక్ ఎన్నికలు పూర్తయ్యే వరకూ సమయం అడగడం ప్రభుత్వ పారదర్శకతపై అనేక సందేహాలకు తావునిస్తోంది.

## ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకం




న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ఇద్దరు కొత్త ఎన్నికల కమిషనర్లను నియమించింది. సుఖ్ బీర్ సింగ్ సంధు, జ్ఞానేశ్ కుమార్ లను ఎన్నికల కమిషనర్లుగా నియమించినట్లు కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరి చెప్పారు. ఎన్నికల సంఘంలో ఖాళీ అయిన కమిషనర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీలో అధీర్ రంజన్ కూడా ఒకరు. అయితే కొత్త కమిషనర్ల నియామకంపై అధికారిక ప్రకటన వెలువడకముందే ఆయన పేర్లను వెల్లడించడం గమనార్హం. ఇటీవల ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.
నెల రోజుల క్రితం మరొక కమిషనర్ అనూప్ చంద్రపాండే రిటైరయ్యారు. లోక్ సభతోపాటు పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఖాళీ అయిన రెండు కమిషనర్ పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయవలసి రావడంతో కమిటీ గురువారం సమావేశమైంది.

## పంజాబ్‌లో 8 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన ఆమ్ ఆద్మీ



చండీఘడ్: పంజాబ్‌లో 8 లోక్‌సభ స్థానాలకు ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేయనున్నది. ఆ 8 మంది సభ్యుల జాబితాను రిలీజ్ చేశారు. దీంట్లో అయిదు మంది ఆ రాష్ట్ర క్యాబినెట్ మంత్రులే ఉన్నారు. అమృత్‌సర్ నుంచి మంత్రి కుల్దీప్ సింగ్ ధాలివాల్, ఖద్దూర్ సాహిబ్ నుంచి లాల్‌జిత్ సింగ్ భుల్లార్, బఠిండా నుంచి గుర్మీత్ సింగ్ కుడియా, సంగ్రూర్ నుంచి గుర్మీత్ సింగ్ మీట్ హయర్, పాటియాలా నుంచి బల్బీర్ సింగ్ పోటీ చేయనున్నారు. ఫతేఘర్ సాహిబ్ సీటు నుంచి గురుప్రీత్ సింగ్ జీపీని రంగంలోకి దించారు. మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అయిన ఆయన ఈమధ్యే ఆప్‌లో చేరారు. ఫరీద్‌కోట్ స్థానం నుంచి పంజాబీ నటుడు కరంజిత్ అన్మోల్ పోటీలో ఉన్నారు. పంజాబ్‌లో మొత్తం 13 పార్లమెంటరీ స్థానాలు ఉన్న విషయం తెలిసిందే.

## భళారే విచిత్రం: మాజీ సిఏంపై ప్రస్తుత సిఎం దావా!



తమిళనాడు రాజకీయాలు అనూహ్యంగా ఉంటాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. తాజాగా జరిగిన ఓ సంఘటన ఇందుకు అద్దం పడుతోంది. మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి కరుప్ప పళనిస్వామిపైన, రాష్ట్ర బిజేపి అధ్యక్షుడు అన్నాసలైపైన ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారంనాడు పరువు నష్టం దావా వేశారు. తనకు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల ముఠాతో సంబంధాలు ఉన్నాయని ఆరోపించినందుకు వారిపై స్టాలిన్ కేసు వేశారు. మాదకద్రవ్యాల కేసులో డిఎంకె మాజీ నేత జాఫర్ సాదిక్ ఇటీవల అరెస్టయిన నేపథ్యంలో స్టాలిన్ కు కూడా మత్తుమందుల ముఠాతో సంబంధాలు ఉన్నాయంటూ పళనిస్వామి, అన్నామలై ఆరోపణలు చేశారు.

## స్వయంగా యుద్ధ ట్యాంకు నడిపిన కిమ్



సియోల్ : ఉత్తర కొరియా ఈ మధ్య కాలంలో నిరంతర యుద్ధ సన్నద్ధత , ఆయుధాల ప్రయోగ పరీక్షలతో దూసుకెళ్తోంది. అగ్రరాజ్యం అమెరికా, పొరుగుదేశం దక్షిణ కొరియాను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేస్తోంది. స్వయంగా ఉత్తర కొరియా అధినేత కిమ్‌జోంగ్ ఉన్ ఎప్పటికప్పుడు సైనిక సన్నద్ధతను పర్యవేక్షిస్తున్నారు. తాజాగా ఆయన సొంతంగా ఓ యుద్ధ ట్యాంకును నడిపినట్లు ఆ దేశ అధికారిక మీడియా కేసీ ఎస్ఏ వెల్లడించింది. వాటికి సంబంధించిన ఫోటోలను విడుదల చేసింది. సైనికుల్లో స్ఫూర్తి నింపేందుకు స్వయంగా కిమ్ రంగం లోకి దిగినట్టు కేసీఎన్ఏ పేర్కొంది. ఇటీవల అభివృద్ధి చేసిన "ప్రపంచం లోనే అత్యంత శక్తిమంతమైన ట్యాంకుల" పనితీరును సైనికులతో ఆయన పర్యవేక్షించినట్టు తెలిపింది. అమెరికా, దక్షిణ కొరియా వార్షిక సైనిక విన్యాసాలు గురువారంతో ముగియనున్నాయి. వీటిని ఉత్తర కొరియా తమపై ఆక్రమణకు సన్నాహకంగా అనుమానిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతిస్పందనగా ట్యాంకులతో తమ పాటవాన్ని ప్రదర్శిస్తోంది.

## కొత్త రేషన్ కార్డుల జారీ ఎప్పుడో...?

**పెద్దపల్లి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడుస్తున్నా కూడా రేషన్ కార్డుల ఊసెత్తక పోవడంతో అర్హులైన వాళ్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలను రేషన్ కార్డు ఉన్నవారికే ఇస్తామని చెప్పడంతో కార్డులు లేని వాళ్లు ఆ పథకాలను అందుకోలేక పోతున్నారు. గత డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, పట్టణ వార్డు సభల్లో గృహజ్యోతి, మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు గానూ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ పథకాలన్నింటినీ రేషన్ కార్డులు కలిగి ఉన్న వారికే అమలు చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. రేషన్ కార్డులు లేని వాళ్లు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవడంతో పాటు రేషన్ కార్డు కోసం కూడా గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసిన ప్రభుత్వం రేషన్ కార్డు కోసం వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ చేయకపోవడం గమనార్హం. ఆ దరఖాస్తులన్నీ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లోనే ఉన్నాయి. అసలు రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులు ఎన్ని అనేది తెలియడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఐదు వేలకు పైగా దరఖాస్తులు వచ్చి ఉంటాయని అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు వాటి గురించి ఏ నిర్ణయం తీసుకోవడం లేదు. ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఐదు లక్షల నుంచి 10 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించారు. ఈ నెలలో 200 యూనిట్ల విద్యుత్ వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించారు. ఇందులో 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఖాతాల్లో జమ చేసే పథకం, 10 లక్షల ఉచిత వైద్యానికి, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి తప్పనిసరిగా రేషన్ కార్డు ఉండాలనే నిబంధన విధించారు. కార్డులు లేక చాలా మంది ఉచిత విద్యుత్ సౌకర్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ సేవలను కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ప్రస్తుతం జిల్లాలో 2,07,231 ఆహార భద్రతా కార్డులు, 12,290 అంత్యోదయ అన్న యోజన కార్డులు, 156 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఐదు వేలకు పైగా దరఖాస్తులు వచ్చి ఉంటాయని అంచనా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటి వరకు వాటి గురించి ఏ నిర్ణయం తీసుకోవడం లేదు.

## మోడికుంటకు మోక్షమెప్పుడో...?

### – 2005 నుంచి పెండింగ్‌లోనే పనులు




**వాజేడు :** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మోడికుంట ప్రాజెక్టుకు మోక్షం కలుగుతుందా.. అని మన్యం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ములుగు జిల్లా వాజేడు మండలంలోని కృష్ణాపురం వద్ద నిర్మించనున్న మోడికుంట ప్రాజెక్టు రెండున్నర దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఉమ్మడి ఆంధ్రపదేశ్ నుంచి విడిపోయి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినా ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టు నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగినప్పటికి పనులు మాత్రం మొదలు కాలేదు. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంతి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అనుమతులు మంజూరు చేశారు. మోడికుంట ప్రాజెక్టు నిర్మాణానికి 2005లో అనుమతులు వచ్చినప్పటికి పనులు మొదలు కాలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉండ టంతో అటవీశాఖ మోకాలడ్డు వేసింది. అటవీశాఖ భూములు కోల్పోతుండటంతో అనుమతులు ఇవ్వలేదు. ఆ భూముల స్థానంలో రెవెన్యూ భూములను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటవీశాఖకు కేటాయించడంతో అటవీశాఖ తొలి దశ అనుమతులు 2008లో వచ్చాయి. నాటి నుంచి రెండో దశ అనుమతులు రావాల్సి ఉండ గా ప్రస్తుతం అటవీశాఖకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.60 కోట్లను చెల్లించాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మొదటి నుంచి అటవీశాఖ అడ్డంకులు సృష్టించడంతో ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ప్రాజెక్టు పనులను దక్కిం చుకున్న గామన్ ఇండియా కంపెనీ పనులను మొద లు పెట్టేందుకు అన్ని చర్యల్ని చేపట్టింది. ఇసుక, ఇతర భారీ యంత్రాలను తరలించగా అటవీశాఖ అభ్యంత రంతో అక్కడే వదిలేసి వెళ్లిపోయింది. ఆ యంత్రాలు ప్రస్తుతం తుప్పుపట్టి పనికిరాని దశలో ఉన్నాయి. నాటి నుంచి తట్టెడు మట్టి కూడా తీయకుండా ప్రాజెక్టు పెండింగ్‌లోనే ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న వాజేడు మండలాన్ని 2016లో మొదట భూపాలపల్లి జిల్లాలో ప్రస్తుతం ములుగు జిల్లాలో కలిపారు. 2018లో భూపాలపల్లి కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభను ఏర్పాటు చేసి గిరిజనులు, గిరిజనేత రుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ప్రాజెక్టు నిర్మాణంతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పడం తో 2019లో పర్యావరణ అనుమతులు వచ్చాయి. దీం తో బీఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించి విడుదల చేయలేదు. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి 2023లో మోడికుంట డీపీఆర్‌కు సీడబ్ల్యూసీ ఆమోదం తెలి పినట్లు గోదావరి బోర్డు వెల్లడించింది. దీంతో అన్ని అనుమతులు వచ్చినప్పటికి పనులు మా త్రం పూర్తికాలేదు. 2005లో కాంట్రాక్టు పనులను దక్కించుకున్న గామన్ ఇండియా కంపెనీ టెండర్ల ను రద్దు చేసే ప్రక్రియ కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నిర్మాణంకు అడ్డంకులు ఏర్పడుతున్నట్లు సమాచారం.

# పొత్తుల కోసం బిజెపి వెంపర్లాట....!




న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుకు సంబంధించి భాగస్వామ్య పక్షాలతో బిజెపి జరుపుతున్న చర్చలు ఓ అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అనే తరహాలో సాగుతున్నాయి. తాజాగా హర్యానాలో మిత్రపక్షమైన జన్‌నాయక్ జనతా పార్టీ (జెజెపి)తో చర్చలు విఫలం కావడంతో ఖట్టర్ ప్రభుత్వం రాజీనామా చేయాల్సి వచ్చింది. స్వతంత్ర సభ్యుల మద్దతుతో ప్రస్తుతానికి బిజెపి తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకోగలిగింది. అధికార కూటమిలో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ బిజెపి నేతలు ప్రతిపక్ష ఇండియా వేదికను వేలెత్తి చూపుతున్నారు. ఇండియా వేదికలో భాగస్వామ్య పక్షాల మధ్య లుకలుకలు తలెత్తాయని చెప్పుకుంటూ సంబరపడిపోతున్నారు. హర్యానాలో అధికార బిజెపి, జెజెపి సంకీర్ణ ప్రభుత్వంలో విభేదాలు తలెత్తడంతో మనోహర్ లాల్ ఖట్టర్ సర్కారు పతనమైంది. లోక్‌సభ ఎన్నికల్లో తనకు ప్రతిష్టాత్మక రోహ్ తక్ సహా రెండు స్థానాలు కేటాయించాలని జేజేపీ కోరగా బీజేపీ అందుకు అంగీకరించలేదు. దీంతో కూటమి విచ్ఛిన్నమైంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏకి 400 స్థానాలు లభిస్తాయని బీరాలు పలుకుతున్న ప్రధాని మోడీకి ఈ పరిణామం ఎదురు దెబ్బేనని చెప్పాలి. లక్ష్య సాధన కోసం ఇప్పటి వరకూ విపక్షాలుగా ఉన్న రాష్ట్రంలోని తెలుగుదేశం, బిజూ జనతాదళ్ (ఒడిషా) పార్టీలకు కమలదళం స్నేహహస్తం అందించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ పార్టీ ప్రభుత్వాన్ని బిజెపి ఎప్పటి నుండో విమర్శిస్తూ వస్తోంది. ఆ రాష్ట్రంలో ఎలాగైనా ప్రతిపక్ష స్థానాన్ని సొంతం చేసుకోవాలని పావులు కదుపుతోంది. అయితే ఇప్పుడు పార్టీ రాష్ట్ర నేతల అభిప్రాయాలను బేఖాతరు చేస్తూ ఒడిషాలో ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బిజెడితో చేతులు కలిపేందుకు మోడీ-షా ద్వయం ప్రయత్నిస్తోంది. రాష్ట్రంలో 2018లో తెలుగుదేశం పార్టీ బిజెపితో తెగతెంపులు చేసుకుంది. అప్పటి నుండీ టిడిపి అధినేత చంద్రబాబును విమర్శించే ఏ అవకాశాన్నీ బిజెపి నాయకులు వదులుకోలేదు. ఆయనను అవినీతిపరుడని, నైతికత లేని వ్యక్తి అని, అవకాశవాది అని నిందించారు. అవినీతి ఆరోపణలపై చంద్రబాబును జగన్మోహన రెడ్డి ప్రభుత్వం అరెస్ట్ చేసినప్పుడు బిజెపి సహకరించిందన్న ఊహాగానాలు కూడా వినవచ్చాయి. అయితే తాజాగా ఆ రాష్ట్రంలో సీను మారిపోయింది. జగన్మోహన రెడ్డిని వదిలేసి చంద్రబాబును భాగస్వామిగా బిజెపి ఎంచుకుంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశంతో సీట్ల సర్దుబాటు కుదుర్చుకుంది.

## వాతావరణాన్ని కాపాడండి...!





**స్టాకహోం :** ముదురుతున్న వాతావరణ సంక్షోభం నేపథ్యంలో చేపట్టాల్సిన మార్పులకు సంబంధించి సత్వరమే చర్యలు చేపట్టాలని కోరుతూ స్వీడిష్ వాతావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్‌తో సహా పలువురు కార్యకర్తలు స్వీడిష్ పార్లమెంట్ వద్ద సోమవారం బైఠాయించారు. ప్రత్యేకంగా ఒక సంస్థకు చెందిన వారిగా కన్నా యువతే ప్రధానంగా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. స్టాకహోంలోని ప్రభుత్వ భవనాల సముదాయం ప్రధాన ప్రవేశమార్గం వెలుపల వారు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. రాజకీయ నేతలు లోపలకు వెళ్ళి తమ విధులు నిర్వర్తించనీయకుండా అడ్డుకున్నారు. వేడెక్కుతున్న భూగోళం, మానవాళికి ముప్పుగా పరిణమిస్తున్న వాతావరణ మార్పులు వేటినీ కూడా స్వీడిష్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితిగా చూడడం లేదని 21ఏళ్ల వాతావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ విమర్శించారు. తాము చాలా చేస్తున్నామని, సరైన దిశలోనే ముందుకు సాగుతున్నామని పైకి కనిపించేలా చేస్తూ లోపల మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇప్పటికీ ఒప్పందంలో పేర్కొన్న కుదిరిన పర్యావరణ లక్ష్యాల సాధనకు ఏ విధంగా ముందుకు సాగాలన్నదానిపై స్వీడిష్ ప్రభుత్వం వద్ద నిర్దిష్ట ప్రణాళికలేవీ లేవని ఆమె విమర్శించారు.

## ప్రఖ్యాత అస్సాం నవలా రచయిత అరుణ్ గోస్వామి కన్నుమూత




**అస్సాం :** సాహిత్య దిగ్గజం, ప్రముఖ నవలా రచయిత, కథా రచయిత అరుణ్ గోస్వామి (80) జోర్హాట్‌లోని మిషన్ ఆసుపత్రిలో మంగళవారం రాత్రి తుది శ్వాస విడిచారు. అతను గత కొద్ది రోజులుగా జోర్హాట్‌లోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (%×జఖ%)లో చికిత్స పొందుతున్నారు. అస్సాంలోని డెర్గావ్‌లో జన్మించిన గోస్వామి సాహిత్యంలో తాను చేసిన అపారమైన కృషికి గాను ప్రపంచ గుర్తింపు పొందారు. అతను 10,000 పేజీలకు పైగా విస్తరించి ఉన్న పొడవైన పుస్తకాన్ని వ్రాసినందుకు ప్రపంచ రికార్డును కూడా సాధించాడు. అసమానమైన వివరాలతో సమాజంలోని సంక్లిష్టతలను ఎత్తిచూపేవారు. అరుణ్ గోస్వామి తన రచనా కాలమంతా అస్సాంలో తిరుగుబాటు వంటి అత్యవసర సమస్యలను పరిష్కరించడంలో తన వంతు సామాజిక బాధ్యత నిర్వహించారు. ముఖ్యంగా ఆయన రచనలలో "కళక్షణ ", "సలాంట్ బిబోరిని" కళాఖండాలు. ఈ రచనలతో విస్తృతమైన ప్రశంసలు పొందారు. రచయితగా తన పాత్రతో పాటు, రాజకీయ విశ్లేషకుడిగా కూడా అరుణ్ గోస్వామి ముఖ్యమైన రచనలు చేశారు.

## ప్రయోగించిన క్షణాల్లోనే పేలిపోయిన జపాన్ తొలి ప్రైవేటు రాకెట్..!



జపాన్ చేపట్టిన తొలి ప్రైవేటు రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ ఘటన పశ్చిమ జపాన్‌లోని వకయమ ప్రిఫెక్చర్‌లోని లాంచ్ ప్యాడ్‌లో చోటు చేసుకొంది. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం దాదాపు 60 అడుగుల పొడవైన కైరోస్ రాకెట్ చిన్న ప్రభుత్వ ప్రయోగ ఉపగ్రహాన్ని తీసుకొని నింగికి ఎగిరింది. కానీ, కొన్ని క్షణాల్లోనే ఇది పేలుడుకు గురై గాల్లోనే అగ్నిగోళంలా మారిపోయింది. దీని శకలాలు చుట్టూ ఉన్న పర్వత పాదాలపై పడ్డాయి. దీంతో తక్షణమే అక్కడ ఉన్న నీటి స్ప్రింక్లర్లు పనిచేయడం మొదలుపెట్టాయి. మరోవైపు పేలుడు ఫలితంగా లాంచ్ ప్యాడ్ ఏరియా మొత్తం నల్లటి పొగ కమ్మేసింది. వాస్తవానికి ప్రయోగించిన 51 నిమిషాల్లోనే ఈ రాకెట్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చాల్సి ఉంది. టోక్యోకు చెందిన స్పేస్ వన్ సంస్థ ఈ రాకెట్‌ను నిర్మించింది. ఈ ప్రయోగం విజయవంతమైతే.. ఆ దేశంలో శాటిలైట్‌ను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తొలి ప్రైవేటు సంస్థగా ఇది రికార్డు సృష్టించేది. ఈ ప్రమాదంపై ఆ కంపెనీ స్పందిస్తూ "కైరోస్ రాకెట్ లాంచింగ్ ప్రక్రియ సజావుగానే సాగింది. కానీ, ప్రయోగాన్ని మధ్యలోనే ఆపేసేందుకు చర్యలు తీసుకొన్నాం" అని స్పేస్ వన్ పేర్కొంది. ఆ నిర్ణయానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. ప్రపంచ వ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ఉపగ్రహ ప్రయోగ మార్కెట్లోకి అడుగుపెట్టాలని భావించిన జపాన్.. తాజా వైఫల్యంతో కొంత నిరాశ చెందింది. ప్రస్తుతం కక్ష్యలో ఉన్న నిఘా ఉపగ్రహాల్లో సమస్యలు తలెత్తితే వెంటనో మరోదానిని నింగిలోకి పంపే ప్రక్రియను ఈ ప్రయోగంలో విశ్లేషించాలనుకొంది. రాకెట్ వైఫల్యాలు జపాన్‌కు కొత్తకాదు. గతేడాది ఎప్సోలాన్ ఎస్ రాకెట్ కూడా ప్రయోగించిన 50 సెకన్లలో పేలిపోయింది. మార్చిలో హెచ్3 రాకెట్ కూడా పేలిపోయింది.

## ఖనిజాలపై పన్ను అధికారం పార్లమెంటుదేనని స్పష్టంగా చెప్పరేం...?



**న్యూఢిల్లీ :** ఖనిజాలపై పన్ను విధించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందన్న విషయాన్ని చట్టం సుస్పష్టంగా ఎందుకు చెప్పదని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని 9 మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఈ అంశంపై మంగళవారం విచారణ కొనసాగించి కొన్ని వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలో పొందుపరిచిన రీతిలో సమాఖ్య అధికారాల విభజనలో.. ఏకరూపత కోసం ఖనిజాలపై పన్నుల్ని కేంద్రమే నిర్ణయిస్తుందని, అది రాష్ట్రాలకు లేదని చెప్పడమే మీ ఉద్దేశమా అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ప్రశ్నించింది.

## అధ్యక్ష పోటీకి బైడెన్, ట్రంప్ అభ్యర్థిత్వాల ఖరారు

అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వానికి డెమోక్రాటిక్ పార్టీ తరఫున జో బైడెన్ నామినేషన్ ఖరారైంది! కేవలం అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. తాజాగా జరిగిన జార్జియా ప్రైమరీలో ఆయన గెలుపొందారు. దీంతో పార్టీ నుంచి నామినేట్ కావడానికి అవసరమైన 1,968 మంది ప్రతినిధులను సంపాదించుకున్నారు. వాషింగ్టన్, మిస్సిసిపీ, నార్తర్న్ మరియానా ఐలాండ్స్‌లోనూ ఆయన విజయం ఖాయమని పార్టీ వర్గాలు ధీమాగా ఉన్నాయి. "ఈ దేశ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఇప్పుడు ఓటర్ల ముందు ఉంది. ధైర్యంగా నిలబడి ప్రజాస్వామ్యాన్ని కాపాడతారా? లేదా దాన్ని కూల్చివేసేందుకు ఇతరులకు అనుమతి ఇస్తారా? మన స్వేచ్ఛను, భద్రతను కాపాడుకునే హక్కును పునరుద్ధరిస్తారా? లేదా వాటిని లాక్కునేవారికి అవకాశమిస్తారా?" అని జార్జియాలో విజయం తర్వాత తన మద్దతుదారులను ఉద్దేశించి బైడెన్ అన్నారు. రిపబ్లికన్ పార్టీ తరఫున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థిత్వం సైతం ఖరారైంది. తాజాగా వాషింగ్టన్ ప్రైమరీలోనూ



ఆయన విజయం సాధించారు. దీంతో నామినేషన్‌కు కావాల్సిన ప్రతినిధుల మద్దతు లభించింది. ఈరోజు వెలువడనున్న మరికొన్ని ప్రైమరీల్లోనూ ఆయన విజయం ఖాయంగానే కనిపిస్తోంది. చివరి వరకు పోటీగా నిలిచిన నిక్కీ హేలీ సైతం రేసు నుంచి వైదొలగిన విషయం తెలిసిందే. దీంతో బైడెన్, ట్రంప్ రెండోసారి అధ్యక్ష పీఠం కోసం పోటీ పడనున్నారు.

## ప్రజారోగ్యానికి వరం టీకా ఔషధం

16 మార్చి 1995న దేశవ్యాప్తంగా 'జోనస్ సాల్క్' కనుగొన్న పోలియో టీకాలను భారత చిన్నారులు అందరికీ ఉద్యమం వలె అందించే 'ఓరల్ పల్స్ పోలియో డ్రైవ్' ప్రారంభమైంది. భారతదేశ ప్రజారోగ్య చరిత్రలో అత్యంత ప్రధానమైన మైలురాయికి గుర్తుగా ప్రతియేట 16 మార్చిన 'జాతీయ వ్యాక్సినేషన్ దినం (నేషనల్ వ్యాక్సినేషన్ లేదా ఇమ్యునైజేషన్ డే)'ను పాటించుట ఆనవాయితీగా మారింది. జాతీయ టీకా దినం-2024 నినాదంగా 'టీకా అందరికీ రక్షణనిస్తుంది (వ్యాక్సీన్ వర్క్ ఫర్ ఆల్)' అనబడే అంశాన్ని తీసుకొని, టీకాలకు భయపడే వారితో పాటు టీకాలను వ్యతిరేకించే వారిని కూడా టీకా పరిధిలోకి తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. పలు ప్రమాదకర వ్యాధులను జీవితకాలం నిరోధించడానికి, ప్రజారోగ్య పరిరక్షణకు, ఆరోగ్య నియంత్రణకు, ప్రాణాలు కాపాడటానికి టీకాలే దివ్య ఔషధాలని ఐరాస - డబ్ల్యూహెచ్ఓ పిలుపునిస్తున్నది. టీకాలతో ఆరోగ్య, ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు కూడా కలుగుతాయని, వ్యాధులు సోకకుండా నాటి నేటి వరకు భారతీయుల ఆరోగ్య కవచంగా నవజాత శిశువు నుండే వయోవృద్ధుల వరకు టీకాలు పలు రోగాల పట్ల వ్యాధినిరోధకశక్తిని పెంపొందించడం, జీవితకాలం వ్యాధులు సోకకుండా కట్టడి చేయడం చూస్తున్నాం. గత మూడేళ్లుగా ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తున్న కోవిడ్-19 వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు మానవ జాతికి వరాలుగా ఆవిష్కరించబడ్డాయి. 'టీకా పితామహుడి'గా పేరుగాంచిన 'ఎడ్వర్డ్ జెన్నర్' స్మాల్‌ఫాక్స్‌కు తొలిసారి టీకా కనుగొన్నారు. 'లూయిస్ పాస్చర్' పరిశోధనల్లో కలరా, ఆన్‌త్రాక్స్ టీకాలు కనుగొనుటలో చురుకైన పాత్రను పోషించారు. ఇండియాలో 19వ శతాబ్దం నుంచి టీకాల ఆవిష్కరణలు జరుగుతున్నాయి. 1940లో పెద్ద ఎత్తున టీకాల ఉద్యమం మొదలైంది. 1960లో యం.యం.ఆర్ (మీసిల్స్, మంప్స్, రుబెల్లా) టీకా, 1972లో ఏకంగా 'స్మాల్‌ఫాక్స్' నిర్మూలన చేయడం చూశాం. గత అర్థశతాబ్దంగా ఇండియాలో ట్యూబర్క్యులోసిస్(టిబి) సోకకుండా బిసిజి (బాసిల్లే కాల్మెట్-గ్యురిన్) టీకాను తొలిసారి ప్రారంభించారు. టైఫాయిడ్-డిఫ్తీరియాలు రాకుండా 1978లో టీకాలను ప్రవేశ పెట్టారు. 'ప్రపంచ ఇమ్యునైజేషన్ డే'ను 10 నవంబర్‌న విశ్వ మానవాళి సమైక్యంగా నిర్వహించుకుంటున్నాం. 1985లో దేశవ్యాప్తంగా 'యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (యూపిఐ)'ను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. పోలియో, టెటనస్, రుబెల్లా, మెనిన్‌జైటిస్, డిఫ్తీరియా, న్యుమోనియా, పెర్ట్యుసిస్, మీసిల్స్, మంప్స్, టిబి, హెపటైటిస్-బిలతో (5 ఏండ్ల లోపు పిల్లలకు) పాటు నేడు కరోనా లాంటి భయంకర వ్యాధులకు టీకాలు అందుబాటులో ఉన్నాయి. తక్షణావసరంగా 12 ఏండ్లు దాటిన పిల్లలకు కూడా కరోనా టీకాలు 16 మార్చి 2022 నుంచి అందుబాటులోకి వచ్చాయి. 'మిషన్ ఇంద్రధనుష్' గొడుగు కింద 2014 డిసెంబర్ నుంచి సార్వత్రిక టీకా పరిధిలోకి మహిళలు, పిల్లలను చేర్చి వ్యాక్సినేషన్ వసతులను ఇళ్ల వద్దనే వేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పథకం ద్వారా 2030 నాటికి టీకాల కొరతతో పిల్లల మరణాలను ఆసాంతం కట్టడి చేయడానికి ప్రణాళికలు వేస్తున్నారు. వ్యాక్సినేషన్‌తోనే రోగాలకు అడ్డుకట్ట వేయగలమని, టీకా పట్ల వ్యతిరేకంగా ఉన్న అమాయక జనులను కూడా టీకాల పరిధిలోని తేవడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. టీకాలు ప్రాణాలు కాపాడుతాయి, టీకా భయంతో తీసుకోని యెడల ప్రాణాపాయం కలగవచ్చని నేటి సమాజం ప్రచారం చేయాలి. 2019 డిసెంబర్‌లో చైనా, వూహాన్ నగరంలో బయట పడిన బాంబు లాంటి కరోనా వైరస్ భారతదేశంలో 30 జనవరి 2020న తొలి కరోనా కేసు రూపంలో బయట పడింది. కరోనా అలల తీవ్రత, అధిక వైరస్ వ్యాప్తి రేటు, ఔషధాల కొరత, ఆసుపత్రుల్లో పడకల/వెంటిలేటర్ల/ఆక్సీజన్ సిలిండర్ల కొరత, వలసల వెతలు, విద్యాలయాల మూసివేత, లాక్‌డౌన్‌లతో ఆర్థిక సంక్షోభాలు, ఉద్యోగ ఉపాధుల కోతలు, ప్రగతిరథానికి బ్రేకులు, టీకాలకు వ్యతిరేకించే జనాలు, వైద్యఆరోగ్య లోసుగులు, రవాణ ఇక్కట్లు, గ్రామీణుల వ్యథలు, ప్రజాపంపిణీ వ్యవస్థల అవస్థలు, కోవిడ్-19 అనంతర రుగ్మతలు, టీకా కొరతలు లాంటి అనేక సమస్యలు ప్రపంచ మానవాళి మెడకు చుట్టుకున్నాయి. 16 జనవరి 2021న ప్రారంభమైన కోవిడ్-19 టీకా ఉద్యమం ద్వారా మార్చి 2023 నాటికి 2.2 బిలియన్ల డోసులు అందించారు. దేశంలో 95 శాతం 12 ఏండ్లు దాటిన ప్రజలకు కనీసం ఒక డోసు, 88 శాతం అర్హతగల ప్రజలకు రెండు డోసులు, 2.3 కోట్లకు పైగా ప్రజలకు బూస్టర్ డోసుల కోవిడ్-19 టీకాలు అందడం ఓ మహత్తర సాఫల్యతగా చెప్పవచ్చు. సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా తయారు చేసిన "కోవిషీల్డ్ టీకాలు", భారత్ బయోటెక్ తయారు చేసిన "కోవాక్సీన్ టీకాలు", డా: రెడ్డి ల్యాబ్స్ తయారు చేసిన "స్పుత్నిక్-వి కోవిడ్-19 టీకాలను" దేశ ప్రజలు తీసుకున్నారని మనకు తెలుసు. వ్యాధుల నివారణ, ప్రజారోగ్య పరిరక్షణ, ఆర్థిక సామాజిక వెసులుబాటు లాంటి పలు ప్రధాన ప్రయోజనాలు కలిగిన టీకా ఉద్యమం విజయవంతం కావడానికి చేయూత ఇవ్వవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నది. టీకాలను సకాలంలో తయారు చేసిన పరిశోధకులు, ఆవిష్కరించిన శాస్త్రవేత్తలు, అందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, సహకరించిన ప్రభుత్వ యంత్రాంగాలకు మనస్పూర్తిగా కృతజ్ఞతలు సమర్పించాల్సిన బాధ్యత ప్రజల మీద ఉన్నది. మన పిల్లలకు సకాలంలో అర్హతగల టీకాలను అందించాల్సిన కనీస కర్తవ్యం తల్లితండ్రులు, కుటుంబ పెద్దల మీద ఉన్నది. వ్యాధి సోకకుండా ముందే జాగ్రత్త పడదాం. 'చికిత్స కన్న నివారణ మిన్న' అని ప్రచారం చేద్దాం.


# బొప్పాయి, దానిమ్మ పండ్లు కలిపి తింటున్నారా...?






మామూలుగా వైద్యులు తరచూ తాజా పండ్లను తీసుకోవాలని చెబుతూ ఉంటారు. తాజా పండ్ల వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు కలుగుతాయని, ఎన్నో రకాల సమస్యలకు చెక్ పెట్టవచ్చని చెబుతూ ఉంటారు. అటువంటి వాటిలో దానిమ్మ, బొప్పాయి కూడా ఒకటి. ఈ రెండు పళ్ళను చిన్నపిల్లల నుంచి పెద్దవారి వరకు ప్రతి ఒక్కరు కూడా ఇష్టపడుతూ ఉంటారు. కొందరు వీటిని విడివిడిగా తింటే మరికొందరు కలిపి తింటూ ఉంటారు. కాగా దానిమ్మలో ఎల్లా గిటానిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. దీన్ని తినడం వల్ల శరీరంలో వాపు తగ్గుతుంది. ఎల్లాగిటానిన్ ఆక్సీకరణ మెదడు కణాలను ప్రోత్సహిస్తుంది. ఇది అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధి నుండి కూడా రక్షిస్తుంది. రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచి రక్తహీనత సమస్య లేకుండా చేస్తుంది. మొటిమలు, నల్లని మచ్చలను తొలగించడానికి సహాయపడుతుంది. అలాగే చుండ్రును తగ్గించి జుట్టు రాలకుండా ఒత్తుగా పెరిగేలా ప్రోత్సహిస్తుంది. వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేస్తుంది.బొప్పాయి, దానిమ్మ పండును కలిపి తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. అదనంగా, ఇది అనేక రకాల వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. ఈ రెండు పండ్లు అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. ఎర్ర రక్త కణాలను ప్రోత్సహిస్తాయి. దీని వల్ల శరీరంలో రక్త కొరత ఉండదు. రక్తహీనత వంటి వ్యాధులను నివారించడంలో పండ్లు ఎంతో మేలు చేస్తాయి. అంతే కాకుండా ఇమ్యూనిటీ బూస్టర్‌గా పనిచేస్తుంది. అదే సమయంలో మలబద్ధకం, ఊబకాయం సమస్యలను దూరం చేస్తుంది. ఉత్తమమైన విషయం ఏమిటంటే, ఈ రెండు పండ్లను కలిపి తినడం వల్ల శరీరంలోని మల్టీవిటమిన్ల లోపాన్ని తీరుస్తుంది. బొప్పాయి, దానిమ్మ పండును కలిపి తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయి. అదనంగా, ఇది అనేక రకాల వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. ఈ రెండు పండ్లు అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి. ఎర్ర రక్త కణాలను ప్రోత్సహిస్తాయి. దీని వల్ల శరీరంలో రక్త కొరత ఉండదు. శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసి ఎటువంటి ఇన్ఫెక్షన్స్ రాకుండా ముఖ్యంగా ఈ సీజన్ లో కాపాడుతుంది. అలాగే రక్తపోటు నియంత్రణలో ఉండేలా చేస్తుంది. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలు.

## కర్బూజ..తింటే భాగ్యం.. ఒంటికి సౌఖ్యం..




ఎండలు మండిపోతున్నాయి. మార్చిలోనే మే నెలను గుర్తుకు తెస్తున్నాయి. మున్ముందు రోజుల్లో ఎండలు మరింత మండిపోతాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ ఎండలకు భయపడి చాలామంది బయటకు వెళ్లరు. మరి అత్యవసరమైన పని ఉన్నవాళ్లు కచ్చితంగా వెళ్లాల్సిందే. అలాంటివారు ఎండలకు ఊరికే నీరసపడిపోతారు. చెమట రూపంలో శరీరంలో లవణాలను కోల్పోతారు. ఇలాంటప్పుడు శరీరానికి శక్తి కావాల్సి ఉంటుంది. ఆ శక్తిని భర్తీ చేయడానికి ఎన్నో పండ్లు ఉన్నాయి. అలాంటి పండ్లల్లో.. కర్బూజ ముఖ్యమైనది. ఇది ఎండాకాలంలో ఎక్కువగా లభిస్తుంది. ఆఫ్రికాలో పుట్టింది:వాస్తవానికి కర్బూజ పండును తర్బూజ అని కూడా పిలుస్తారు. ఈ పండు ఆఫ్రికా ఖండంలో పుట్టింది. ఆ తర్వాత మధ్యధరా దేశాల మీదుగా ఐరోపా, దక్షిణాఫ్రికా, ఆసియా దేశాలకు విస్తరించింది. ఈ పండును పశ్చిమ ఆఫ్రికాలో విస్తారంగా సాగు చేస్తారు. అయితే అక్కడి ప్రజలు పండుగ విత్తనాల కోసం సాగు చేయడం విశేషం. అయితే ఈ పండు మొదట్లో ఈ స్థాయిలో తీయగా ఉండేది కాదట. కొంచెం చేదుగా ఉండేదట. దీనిని అనేక రకాలుగా అభివృద్ధి చేసి తీపి రకాన్ని ఆవిష్కరించారట. ఇప్పుడు ఆ తీపి రకం విత్తనాల కాయలనే మనం తింటున్నాం. అందువల్లే కర్బూజ పండుకు వేసవిలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది. కర్బూజ పండును ఈజిప్టు ప్రజలు నాలుగువేల సంవత్సరాల క్రితమే సాగు చేశారట. అక్కడి ప్రాచీన సమాధుల మీద ఉన్న చిత్రాల ఆధారంగా చరిత్రకారులు ఈ విషయాన్ని గుర్తించారు. మరణం తర్వాత తన పూర్వీకులు దాహం తీర్చుకోవడానికి ఈ పండ్లు ఉపకరిస్తాయని అక్కడి ప్రజలు నమ్మేవారట. గ్రీకు దేశస్తులు కర్బూజ కాయను పెపాన్ అని పిలుస్తారు. చిన్నపిల్లలకు గుండెపోటు వస్తే కర్బూజ తొక్కలను తల మీద పెట్టి చికిత్స చేసేవారట. కర్బూజ ను శరీరానికి చల్లదనాన్ని కలిగించే ఆహారంగా గ్రీకు దేశస్థులు భావించే వారట. కర్బుజా కాయ ఈ 1856లో వివాదాలకు కూడా కారణమైంది. వాటర్ మెలన్ రాయట్.. తెలుగులో చెప్పాలంటే కర్బూజ దొమ్మి అనే ఘటన చోటు చేసుకుంది. అమెరికాలోని కాలిఫోర్నియా నుంచి ఓ రైలు బయలుదేరింది. అది ఆ ఏడాది ఏప్రిల్ 15న పనామా రాజధానికి చేరుకుంది. అక్కడ దిగిన ఒక వ్యక్తి దగ్గర్లో ఉన్న పండ్ల దుకాణానికి వెళ్ళాడు. ఓ కర్బూజ ముక్క తీసుకున్నాడు. డబ్బులు చెల్లించకపోవడంతో.. ఆ వ్యాపారి గట్టిగా అడిగాడు. దీంతో ఆ ప్రయాణికుడు తుపాకీ తీశాడు. ఆ వ్యాపారి కూడా అంతే ఆవేశంగా తన దగ్గర ఉన్న కత్తి తీసి దాడి చేయబోయాడు. దీంతో ఆ ఘటన చినికి చినికి గాలి వాన లాగా మారింది. చివరికి అమెరికన్ ప్రయాణికులు, స్థానికుల మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. మరి కొంతమంది గాయపడ్డారు.కర్బూజ పండులో 92 శాతం నీరు ఉంటుంది. పండుగా తిన్నా, పండ్ల రసంగా తాగిన ఒకే రకమైన ఉత్సాహాన్ని ఇస్తుంది. ఇందులో విటమిన్ ఏ, సీ పుష్కలంగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని, కంటి చూపును అవి మెరుగుపరుస్తాయి. జీర్ణ క్రియను పెంపొందిస్తాయి. కర్బూజా లో ఉండే లైకోపీన్ అనే ఆరోగ్యకరమైన కొవ్వును పెంపొందిస్తుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఇది రుచికి తియ్యగా ఉన్నప్పటికీ ఇందులో కేలరీలు, కొవ్వులు తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా మలబద్ధకాన్ని నివారిస్తుంది. లవణాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వేసవికాలంలో దీనిని తరచూ తీసుకుంటే శరీరానికి నీరసం అనేది రాదు. ఇంకా కొన్ని అధ్యయనాల్లో ఇది క్యాన్సర్ ను కూడా నివారిస్తుందని తేలింది.

## విటమిన్ డి ఎలా వస్తుంది....?




శరీరానికి చాలా విటమిన్లు అవసరం. ఇక విటమిన్ డి న్యూరోట్రాన్స్ మీటర్ లా పనిచేస్తుంది. మెదడు నుంచి శరీరంలోని అన్ని అవయవాలకు సందేశాలను పంపిస్తుంది. ఇది హార్మోన్ల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. అయితే విటమిన్లు లోపిస్తే ఆరోగ్యం దెబ్బతినడమే కాదు శరీరంలోని డోపమైన్ స్థాయి ప్రభావితం అవుతుంది. డిప్రెషన్ వంటి వ్యాధుల బారిన కూడా పడుతారు. అయితే విటమిన్ డి మాత్రం ఎలాంటి ఖర్చు లేకుండానే వస్తుంది. దీని కోసం ఎండలో నిల్చుంటే చాలు. కేవలం సూర్యుని నుంచి వచ్చే ఎండను శరీరానికి తాకేలా చేస్తే సరిపోతుంది. ఇంతకీ ఏ సమయంలో కూర్చోవాలి. ఎంత సమయం కూర్చోవాలి? ఎప్పుడు కూర్చోవాలి? వంటి సందేహాలు చాలా మందిలో ఉంటాయి. మరి ఆ విషయాలను మీరు కూడా తెలుసుకోవాలి అనుకుంటే ఈ ఆర్టికల్ ను చదివేసేయండి. అయితే సూర్యుని ఎండ వల్ల విటమిన్ డి సప్లిమెంట్లను పొందవచ్చు. ఇక ఈ ఎండకోసం ప్రతిరోజు 10 నుంచి 30ని. సూర్యరశ్మిలో నిల్చోవాలి. ఇక ఎండలో ఎంత సేపు ఉండాలి అనేది వ్యక్తిని బట్టి ఉంటుంది. పరిస్థితిని బట్టి కూడా ఉంటుంది. సూర్యకాంతిలోనే విటమిన్ డి ఎక్కువగా లభిస్తుంది. అయితే ఇలా మీరు సూర్యరశ్మిలో ఉన్నప్పుడు మీ చర్మం రంగు మారే అవకాశం ఉంటుంది. ఈ కాంతే విటమిన్ డి కి మూలంగా ఉంటుంది. అయితే ఈ విటమిన్ డి పిల్లలు, శిశువులు పెద్దలు అందరికి కూడా ఒకేలా ఉంటుంది. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నప్పుడు ఉదయం వేడి ఎక్కువ ఉంటుంది. అందుకే ఉదయమే ఎండలో నిల్చోవాలి. ఈ ఎండలో మాత్రమే విటమిన్ డి వస్తుంది.

## ఈ డ్రింక్ తాగితే ఎక్కడా లేని శక్తి.....!



మార్చిలోనే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మండే ఎండతో మాడు పగలగొడుతున్నాడు. ఏదైనా పని మీద బయటకు వెళ్లి ఇంటికి వస్తే చాలు నీరసం ఆవహిస్తోంది. ఒంటినిండా చెమట పడుతోంది. ఇలాంటప్పుడు ఏం కాదని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం ముంచుకొస్తుంది. ఈ క్రమంలో ఒంటికి సత్వర శక్తి ఇచ్చే పానీయం కావాలి. అలాంటి పానీయాలలో ముందు వరుసలో ఉండేది కొరియన్ మ్యాంగో మిల్క్ రెసిపీ. వాస్తవానికి ఇప్పుడు మ్యాంగో (మామిడి పండ్లు) సీజన్ కాకపోయినప్పటికీ.. సూపర్ మార్కెట్లో మామిడి పండ్లు లభిస్తూనే ఉన్నాయి. అలా లభించినప్పుడు కొన్ని మామిడి పండ్లను తీసుకొచ్చి ఫ్రిజ్లో పడేస్తే చాలాకాలం నిల్వ ఉంటాయి. మ్యాంగో మిల్క్ కంటే కొరియన్ మ్యాంగో మిల్క్ షేక్ విభిన్నమైన రుచి కలిగి ఉంటుంది. పైగా ఇందులో పోషకాలు అధికంగా ఉంటాయి. అందువల్ల శరీరానికి అవి సత్వర శక్తిని అందిస్తాయి. ఇంతకీ దీన్ని ఎలా తయారు చేయాలంటే.. ముందుగా పండిన మామిడికాయను తీసుకొని.. దానిని శుభ్రంగా కడగాలి. అనంతరం అందులో ఉన్న గుజ్జును తీసి మిక్సీ పట్టాలి. అలా మిక్సీ పడితే రసం బయటకు వస్తుంది. ఆ రసంలో ఐసు ముక్కలు, పాలను కలపాలి. తర్వాత నానబెట్టుకున్న సగ్గుబియ్యాన్ని మిక్సీలో పట్టాలి. అనంతరం మామిడి రసం, పాలు, ఐస్ మిశ్రమంలో సగ్గుబియ్యం మిక్స్ కలపాలి. ఇలా చేస్తే సూపర్ క్రిమి, స్మూత్ టెక్చర్ వస్తుంది. అయితే ఇందులో షుగర్ లెవెల్స్ అధికంగా ఉంటాయి. అలాంటప్పుడు డయాబెటిక్ ఉన్నవారు వైద్యుల సలహాల మేరకు తీసుకోవాలి. అలా తయారుచేసిన కొరియన్ మ్యాంగో మిల్క్ షేక్ ను ఫ్రిజ్ లో ఉంచి.. దానిపై కొన్ని డ్రైఫ్రూట్స్ వేసుకొని తాగితే భలే టేస్ట్ ఉంటుంది. ఎండాకాలంలో నీరసంగా ఉన్నప్పుడు ఈ మిల్క్ షేక్ తాగితే ఉపయుక్తంగా ఉంటుంది. శరీరం సత్వరమే రీఛార్జ్ అవుతుంది. దీనివల్ల పోయిన లవణాలను తిరిగి శరీరం పెంపొందించుకుంటుంది.. జీర్ణ క్రియను పెంపొందిస్తుంది.

## నిద్రలో అలా జరిగితే ఈ వ్యాధి బారిన పడ్డట్లే!



ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు కొత్త వ్యాధులతో మానవులు ప్రాణాలు కోల్పోతున్నారు. అందువలన ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మనం తీసుకుంటున్న ఆహారం,జీవన శైలి కారణంగా అనేక అనారోగ్య సమస్యలు పుట్టుకొస్తున్నాయి. అందులో స్లీప్ పెరాలసిస్ ఒకటి. స్లీప్ పెరాలసిస్ అనేది పడుకున్నప్పుడు ఒక్కసారిగా కదలడంలో ఇబ్బంది, మాట్లాడక లేకపోవడం, శ్వాస తీసుకోవడంలో సమస్యలు, భయం భయం, విచిత్రమైన శబ్ధాలు వినిపించడంలా అనిపిస్తే అది స్లీప్ పెరాలసిస్. ఇది 14-17 ఏళ్ల వయస్సులో మొదటిసారిగా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ స్లీప్ పెరాలసిస్ అనేది 10 నుంచి 15 నిమిషాల పాటు మాత్రమే ఉంటుంది. అయితే ఇది ఎక్కువగా కొన్ని రకాల మందులు, ఆయుర్వేద మెడిసిన్ లాంటివి అతిగా వాడే వారికి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

## బీర్ తాగుతున్నారా.....?

నేటి కాలంలో ప్రతి ఒక్కరూ రోజంతా ఏదో ఒత్తిడితో ఉంటున్నారు. ఉద్యోగులు, వ్యాపారులతో పాటు యూత్ కూడా కొన్ని విషయాల్లో టెన్షన్ పడుతున్నారు. దీంతో అప్పుడప్పుడు రిలాక్స్ కోసం ఫ్రెండ్స్ తో కలిసి మందేసి చిందేయాలని అనుకుంటారు. ఈ క్రమంలో ఎక్కువగా చల్లటి బీర్ తాగడానికి ఎక్కువగా ఇంట్రెస్ట్ పెడుతారు. బీర్ అనగానే చాలా మంది ఏదో తెలియని ఉత్సాహం. ఓ వైపు బాడీని కూల్ చేయడంతో పాటు మరోవైపు మత్తెక్కించే బీర్ తాగడం వల్ల ఎంజాయ్ చేస్తామని చాలా మంది పేర్కొంటారు. అయితే బీర్ తాగేటప్పుడు కొందరు ఫుడ్ విషయంలో ఈ తప్పులు చేస్తారు. దీంతో మానసికోల్లాసం అటుంచి కొత్త రోగాలు వస్తాయని అంటారు. ఇంతకీ అసలు విషయమేంటంటే? చల్లటీ బీర్ తాగేటప్పుడు వాటికి మంచింగ్ కోసం స్పైస్ ఫుడ్ ఉండాలని కోరుకుంటారు. దీంతో చికెన్, రోస్టెడ్ ఫుడ్ ఉండేవి తీసుకుంటారు. అంతేకాకుండా మాంసాహారం తీసుకోవడం వల్ల మంచి ఎనర్జీ ఉంటుందని భావించి ఎక్కువగా వాటికే ప్రిఫరెన్స్ చేస్తారు. అయితే ఇవి తాత్కాలికంగా మంచి రుచిని అందిస్తాయి. దీర్ఘకాలికంగా వీటితో అనర్థాలే అని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే బీర్ తాగడం వల్ల శరీరం డీ హైడ్రేషన్ కు గురవుతుంది. ఇలాంటి సమయంలో స్పైస్ ఫుడ్ తీసుకోవడం డైజేషన్ సమస్యలు వచ్చి అనారోగ్యానికి గురవుతారు. ఈ నేపథ్యంలో అసలు బీర్ తాగేటప్పుడు ఎలాంటి ఫుడ్ తీసుకోవాలి? అనే సందేహం ఉంటుంది. బీర్ లో ఎక్కువగా సోడియం ఉటుంది. దీనికి విరుద్ధమైన ఫుడ్స్ తీసుకోవడం




వల్ల ఎలాంటి సమస్యలు ఉండవు. అంటే ఫ్రూట్స్ తో పాటు ఫైబర్ ఎక్కువగా ఉన్న పదార్థాలు తీసుకోవడం మంచిదని అంటున్నారు. ఫైబర్ ఎక్కువగా ఉండే ఫుడ్ తో పాటు లైట్ ఫుడ్ తీసుకోవడం వల్ల ఎలాంటి జీర్ణ క్రియ సమస్యలు ఉండవు. అందువల్ల బీర్ తాగే వారు ఫుడ్ విషయంలో ఎలాంటి పొరపాటు చేయకుండా జాగ్రత్తగా ఉండాలి. ఇక కొందరు బీర్ తాగేటప్పుడు అస్సలు ఫుడ్ తీసుకోరు. కానీ ఇది చాలా ప్రమాదం. ఎలాంటి ఆల్కహాల్ తీసుకున్నా లైట్ ఫుడ్ తప్పనసరి తీసుకోవాలి. దీంతో శరీరంలోని జీర్ణక్రియ సమతుల్యమై ఆల్కహాల్ ఎఫెక్ట్ శరీరంపై పడకుండా ఉంటుంది. లేకుంటే అల్కహాల్ ఎక్కువై శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది రాను రాను కిడ్నీలను నాశనం చేసే స్థాయికి వెళ్తుంది.

## నానబెట్టిన గింజలు ఎప్పుడు తినాలి...?



నానబెట్టిన గింజలను తింటే ఆరోగ్యానికి ఎంతో మంచిదని సూచిస్తారు నిపుణులు. వీటి వల్ల చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఎన్నో విటమిన్ల సమూహం ఈ నానబెట్టిన గింజలు. ఇవి శరీరంలో శక్తిని పెంచుతాయి. మరి వీటి వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటి? ఎప్పుడు తినాలి అనే వివరాలు తెలుసుకుందాం.. నానబెట్టిన బాదం కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అంతేకాదు జ్ఞాపక శక్తిని పెంచడంలో కూడా తోడ్పడుతుంది. అయితే ఈ నానబెట్టిన గింజలను ఉదయం తీసుకుంటే బరువు తగ్గడంలో కూడా ఉపయోగపడతాయి అంటున్నారు నిపుణులు. కొన్ని కిలోల బరువు తగ్గాలి అనుకుంటే పిస్తా, వాల్ నట్స్ లను నానబెట్టి తినండి. దీని వల్ల తొందరగా రిజల్ట్ వస్తుందట. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా ఈ నానబెట్టిన గింజలు మంచి పాత్రను పోషిస్తాయి. వీటివల్ల మరో ముఖ్యమైన ప్రయోజనం కూడా ఉందండోయ్..అదేంటి అంటే.. ఈ మధ్య కాలంలో చాలా మంది గుండె సమస్యల వల్ల సతమతమవుతున్నారు.

# 'అఖండ2' అప్పుడే మొదలు..?



అగ్ర కథానాయకుడు బాలకృష్ణ వరుస విజయాలతో జోరుమీదున్నారు. అఖండ, వీరసింహా రెడ్డి, భగవంత్ కేసరి చిత్రాలతో హ్యాట్రిక్ కొట్టారు. ప్రస్తుతం ఆయన బాబీ దర్శకత్వంలో తన 109వ చిత్రంలో నటిస్తున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుండగా బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ' ఏ స్థాయిలో విజయాన్నందుకుందో తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద వందకోట్ల మైలురాయిని దాటిందీ చిత్రం. దీంతో సీక్వెల్ ఎప్పుడు మొదలవుతుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం నవంబర్‌లో 'అఖండ2' సెట్స్‌పైకి వెళ్లనుందని తెలిసింది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కూడా కీలక పాత్రలో నటించనున్నారని, పాన్ ఇండియా రిలీజ్‌ను దృష్టిలో పెట్టుకొని ఆయన్ని తీసుకోబోతున్నారని తెలిసింది. మొదటి భాగానికి మించిన సోషియో ఫాంటసీ, యాక్షన్, ఎమోషనల్ అంశాలతో సీక్వెల్‌ను తీర్చిదిద్దేందుకు దర్శకుడు బోయపాటి శ్రీను కసరత్తులు చేస్తున్నారని చెబుతున్నారు. ఈ సీక్వెల్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశముందని సమాచారం.



# విశ్వంభరలో త్రిష ద్విపాత్రాభినయం?..

'పొన్నియన్ సెల్వన్' చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్‌లో విజయాల బాట పట్టింది సీనియర్ కథానాయిక త్రిష. ఇరవైఏళ్లకుపైగా కెరీర్‌లో కొనసాగుతున్న ఈ అమ్మడు ఇప్పటికీ వన్నె తరగని అందంతో అలరారుతున్నది. ప్రస్తుతం ఈ భామ చేతిలో అరడజనుకుపైగా సినిమాలున్నాయి. అవన్నీ భారీ చిత్రాలే కావడం విశేషం. ఇక తెలుగులో ఈ భామ చిరంజీవి సరసన 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నది. 'స్టాలిన్' తర్వాత వీరిద్దరు మరలా జోడీ కట్టడం విశేషం. ఇటీవలే ఈ సినిమా సెట్స్‌లో త్రిష జాయిన్ అయిందని తెలిసింది. ఇదిలా వుండగా ఈ సినిమాలో త్రిష పాత్ర గురించి ఆసక్తికరమైన విషయం బయటికొచ్చింది. సోషియో ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా భిన్న కాల వ్యవధుల్లో సాగుతుందని, ఇందులో త్రిష ద్విపాత్రాభినయంలో కనిపించనుందని అంటున్నారు. కథాగమనంలో ఆమె పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, తెలుగులో త్రిషకు పూర్వ వైభవం తీసుకొచ్చే పాత్ర ఇదని చెబుతున్నారు. ప్రస్తుతం త్రిష మలయాళంలో రామ్, ఐడెంటిటీ చిత్రాలను చేస్తున్నది. తమిళంలో మణిరత్నం కమల్‌హాసన్ 'థగ్ లైఫ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది.



# అందుకే అతన్ని ప్రేమించా!

ప్రియుడు మథియాస్ బో గురించి తొలిసారి తన మనసులోని మాటల్ని బయట పెట్టింది అగ్ర కథానాయిక తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ అయిన మథియాస్ బోతో ఈ అమ్మడు గత తొమ్మిదేళ్లుగా ప్రేమలో ఉంది. అయితే తన లవ్‌ఎఫైర్‌పై ఈ భామ ఇప్పటివరకు ఎక్కడా స్పందించలేదు. ఈ జంట త్వరలో పెళ్లిపీటలెక్కబోతున్నారని వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మథియాస్‌బో గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది తాప్సీ. 'మథియాస్ పరిచయం కాకముందు నేను కొంతమంది అబ్బాయిలతో స్నేహం చేశాను. కానీ ఎవరి వ్యక్తిత్వం నన్ను ఆకట్టుకోలేదు. పురుషుల్లో నిజాయితీతో పాటు జీవితం పట్ల పరిణతి ఉండాలని క్రమంగా తెలుసుకున్నా. ఈ లక్షణాలు మథియాస్ బోలో పుష్కలంగా ఉన్నాయి. అతను నా జీవితానికి భద్రత కల్పించగలడని మా ప్రయాణంలో అర్థం చేసుకున్నా. గొప్ప వ్యక్తిత్వం కలిగిన అతనితోనే జీవితాన్ని పంచుకోవాలనే నిర్ణయానికొచ్చా' అని తాప్సీ చెప్పింది. అయితే పెళ్లి వార్తలపై స్పందించడానికి ఈ భామ నిరాకరించింది. సమయం వచ్చినప్పుడు తానే ఈ విషయాన్ని వెల్లడిస్తానని చెప్పుకొచ్చింది.

# బ్యాంకాక్‌లో 'కుబేర'

ధనుష్, నాగార్జున కథానాయకులుగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ మల్టీస్టారర్ 'కుబేర'. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్, అమిగోస్ క్రియేషన్స్ పతాకాలపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. తనదైన శైలిలో సామాజిక అంశాలను స్పృశిస్తూ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా విడుదలైన ధనుష్ ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభించింది. ఈ సినిమా తాజా షెడ్యూల్ బ్యాంకాక్‌లో మొదలైంది. ఇందులో నాగార్జునతో పాటు చిత్ర ప్రధాన తారాగణం పాల్గొంటున్నారు. టాకీతో పాటు యాక్షన్ పార్ట్‌ను తెరకెక్కించబోతున్నామని, బ్యాంకాక్‌లో ఇప్పటి వరకు ఎవరూ చూడని సరికొత్త లొకేషన్స్‌లో షూటింగ్ జరుపుతున్నామని చిత్ర బృందం పేర్కొంది. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: రామకృష్ణ సబ్బాని, మోనికా నిగోత్రే, దర్శకత్వం: శేఖర్ కమ్ముల.



# వ్యాపార రంగంలో మహిళలకు సవాళ్లెన్నో...!



న్యూఢిల్లీ: మనదేశంలో మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం కోసం, సాధికారత కోసం ప్రయత్నిస్తూ ఎంట్రప్రెనార్‌షిప్ (వ్యవస్థాపకత) రంగంలోకి పెద్ద ఎత్తున వస్తున్నారు. వివిధ పరిశ్రమలలో తమదైన ముద్ర వేస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య పెరిగినప్పటికీ, వాళ్లకు సవాళ్లేమీ తక్కువగా లేవు. వ్యాపారాన్ని అభివృద్ధి చేసే వినూత్న ఆలోచనలు ఉన్నప్పటికీ, చాలా మంది మహిళలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని, నిధుల మద్దతును పొందడంలో అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. ఈ అసమానతను, అంతరాన్ని తగ్గించడానికి పోటీ వ్యాపార రంగంలో అభివృద్ధి చెందడానికి మహిళా వ్యాపారవేత్తలను శక్తివంతం చేయడానికి తగిన మద్దతు, కార్యక్రమాలు అవసరం. 2021 సంవత్సరంలో పనిప్రదేశాల్లో మహిళల సంఖ్య 21 శాతం నుంచి 2023లో 26 శాతానికి చేరుకుందని, ఇది మంచి విషయమని గ్రేట్ ప్లేస్ టు వర్క్? సీఈఓ యశస్విని రామస్వామి అన్నారు. పని ప్రదేశాల్లో తగిన వసతులను పెంపొందించడంలో భారతదేశం గణనీయమైన పురోగతి సాధించినప్పటికీ, సామాజిక-, ఆర్థిక అవరోధాలు ఇప్పటికీ తొలగిపోలేదని అభిప్రాయపడ్డారు. వాళ్లు మరింత శక్తివంతంగా మారే వాతావరణాన్ని సృష్టించాలని రామస్వామి అన్నారు. మహిళలకు అనుకూలమైన పని వాతావరణాన్ని నిర్మించిన సంస్థలు చాలా లాభపడతాయని, ఉత్పాదకత ఎక్కువగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. యెస్ మేడమ్ సహ-వ్యవస్థాపకురాలు ఆకాంక్ష విష్ణోయ్ మాట్లాడుతూ, మహిళలు అభివృద్ధి చెందడానికి సహాయక వాతావరణాన్ని సృష్టించడం ద్వారా ఈ అడ్డంకులను పరిష్కరించవచ్చని అన్నారు. నిధుల సేకరణ విషయంలో మహిళా పారిశ్రామికవేత్తలు చాలా సవాళ్లను ఎదుర్కొంటున్నారు. నిధుల ప్రక్రియలో లింగ పక్షపాతం బాగా ఉందని పరిశోధనలు చెబుతున్నాయి. దాదాపు 62 శాతం మంది మహిళా పారిశ్రామికవేత్తలు ఏదో ఒక రకమైన పక్షపాతాన్ని అనుభవిస్తున్నారు. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని, నిధుల మద్దతును పొందడానికి మహిళలు తంటాలు పడుతున్నారు. 2022-2023 మధ్య మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌లు సేకరించిన నిధులలో 2.4 బిలియన్ డాలర్ల నుంచి 480 మిలియన్ డాలర్లకు తగ్గిపోయాయని పిక్‌మైవర్క్ సహ-వ్యవస్థాపకురాలు కాజల్ మాలిక్ చెప్పారు.

## అందుబాటు గృహాలకు స్థలాలు కేటాయించండి...!



**హైదరాబాద్ :** సామాన్య, మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను నిజం చేయాలంటే అందుబాటు గృహాలను నిర్మించాలి. చందన్‌వెల్లి, కొత్తూరు వంటి పలు ప్రాంతాలలో తయారీ రంగం అభివృద్ధి చెందింది. ఆయా ప్రాంతాలలో రూ.50 లక్షల లోపు ధర ఉండే అఫర్డబుల్ హౌసింగ్‌కు డిమాండ్ ఉంది. కానీ, స్థలాలు అందుబాటులో లేవు. ప్రభుత్వం చొరవ తీసుకొని రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను కల్పించడంతో పాటు స్థలాలను అందించాలని" భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఐటీ, ఫార్మా రంగాలతో అభివృద్ధి పశ్చిమ హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైంది. దీంతో ఆయా ప్రాంతాలలో లగ్జరీ ప్రా జెక్ట్‌లు ఎక్కువగా వస్తున్నాయి. ధరలు ఎక్కువగా ఉండటంతో సామాన్యుని సొంతింటి కల మరింత భారంగా మా రిందని, దీనికి పరిష్కారం అందుబాటు గృహాల నిర్మాణమేనని క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వీ రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. ఓఆర్ఆర్ చుట్టూ స్థలాలను గుర్తించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఈ ప్రాజెక్ట్‌లను నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఆయా గృహాలను విక్రయిస్తామని పేర్కొన్నారు. మహిళా గృహ కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతానికి తగ్గించాలని కోరారు.

## వంటగ్యాస్‌పై రూ.100 తగ్గింపు....!

**న్యూఢిల్లీ :** మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఓ శుభవార్త చెప్పారు. గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండరు ధరలో రూ.100 మేర తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. దేశంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. శుక్రవారం అర్ధరాత్రి నుంచే కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. తాజా తగ్గింపుతో దేశ రాజధాని దిల్లీలో 14.2 కిలోల సిలిండరు ధర రూ.803కు చేరనుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. స్థానిక పన్నుల ఆధారంగా రాష్ట్రాలనుబట్టి ధరల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. అంతర్జాతీయంగా ధరలు దిగొచ్చిన నేపథ్యంలోనే దేశీయంగా ఈ తగ్గింపు సాధ్యమైందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పెట్రో ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులేదు. గత 23 నెలలుగా అవి స్థిరంగా కొనసాగుతున్నాయి. గత ఆరు నెలల్లో వంటగ్యాస్ ధరను తగ్గించడం ఇది రెండోసారి. గతేడాది అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆగస్టు చివర్లో ఒక్కో సిలిండరు ధరను రూ.200 మేర కేంద్రం కుదించింది. దీంతో 14.2 కిలోల సిలిండరు ధర ఆర్నెల్లలో రూ.300 మేర తగ్గి రూ.1,103 నుంచి రూ.803కు చేరింది. "పీఎం ఉజ్వల యోజన కింద రూ.300 రాయితీ పొందుతున్నవారికి సిలిండరు రూ.503కే లభించనుంది. మిగతావారు దీన్ని రూ.803కు పొందవచ్చు" అని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురీ తెలిపారు. మరోవైపు.. ప్రధాని అధ్యక్షతన గురువారం భేటీ అయిన కేంద్ర మంత్రిమండలి ఉజ్వల రాయితీని 2025 మార్చి వరకు పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. అంతర్జాతీయంగా ధరలు దిగొచ్చిన నేపథ్యంలోనే దేశీయంగా ఈ తగ్గింపు సాధ్యమైందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పెట్రో ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులేదు. గత 23 నెలలుగా అవి స్థిరంగా కొనసాగుతున్నాయి.

# ఉల్లి కోసం కేంద్ర సర్కార్ ప్రత్యేక ప్రణాళిక...

న్యూఢిల్లీ: ప్రస్తుతం ఉల్లి ధరలు అదుపులో ఉన్నప్పటికీ భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసింది. ఉల్లి ద్రవ్యోల్బణాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం ఫూల్‌ప్రూఫ్ ప్లాన్‌ను రూపొందించింది. ఆ తర్వాత ఉల్లికి సంబంధించి సంక్షోభం ఏర్పడినా సామాన్యులు మాత్రం కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. గతేడాది ఉల్లి ధరలు సామాన్య ప్రజలను కంటతడి పెట్టించాయి. ధరలను నియంత్రించేందుకు, అలాగే ఉల్లి కొరత లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఉల్లికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక రూపొందించిందో చూద్దాం.. ప్రభుత్వం ఈ ఏడాది ఐదు లక్షల టన్నుల ఉల్లిని బఫర్ స్టాక్ కోసం కొనుగోలు చేయాలని యోచిస్తోంది. ధరలు పెరిగినప్పుడు వాటిని నియంత్రించడానికి దీనిని ఉపయోగించవచ్చు. ప్రభుత్వం తరపున ఎన్‌సిసిఎఫ్ (నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్), నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) వంటి ఏజెన్సీలు ఉల్లిని కొనుగోలు చేయనున్నాయని వర్గాలు తెలిపాయి. ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ గత ఏడాది ఐదు లక్షల టన్నుల బఫర్ స్టాక్‌ను రూపొందించింది. ఇందులో ఇంకా లక్ష టన్నులు అందుబాటులోనే ఉన్నాయి. బఫర్ స్టాక్ నుండి రాయితీ ధరలకు ఉల్లిపాయలను విక్రయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ధరలను నియంత్రించడంలో సహాయపడిందని వర్గాలు తెలిపాయి. ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేతపై ప్రభుత్వం ఈ నెలాఖరులో నిర్ణయం తీసుకోనుంది.



ఈ నిషేధం మార్చి 31 వరకు ఉంటుంది. 2023-24లో ఉల్లి ఉత్పత్తి తగ్గుతుందన్న అంచనాల మధ్య బఫర్ స్టాక్‌ను రూపొందించాలనే ప్రభుత్వ ప్రణాళిక వచ్చింది.

## బ్యాంకు ఉద్యోగుల వేతనాలు 17% పెంపు



**న్యూఢిల్లీ :** బ్యాంకు ఉద్యోగుల వార్షిక వేతనం 17% పెరగనుంది. ఇందుకు సంబంధించి ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్, బ్యాంక్ ఉద్యోగుల సంఘాల మధ్య శుక్రవారం ఒప్పందం కుదిరింది. ఇందువల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఏడాదికి అదనంగా రూ.8,284 కోట్లు ఖర్చుకానుంది.


ఈ వేతన పెంపు 2022 నవంబరు నుంచి అమలు రానుంది. దీంతో దాదాపు 8 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. బ్యాంకులు వారానికి 5 రోజులే పనిచేసేలా, అన్ని శనివారాలను సెలవుగా గుర్తించడానికి ఆలిండియా బ్యాంక్స్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ ఒప్పుకుంది.

## ఇన్ఫోసిస్‌లో సుధామూర్తికి రూ.5,600 కోట్ల విలువైన షేర్లు



రాజ్యసభ సభ్యురాలుగా నియమితులైన సుధామూర్తికి ఐటీ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్‌లో 0.83% వాటాకు సమానమైన 3.45 కోట్ల షేర్లు ఉన్నాయి. ప్రస్తుత షేరు ధర రూ.1,616.95 ప్రకారం, సుధామూర్తి షేర్ల విలువ రూ.5,600 కోట్ల వరకు ఉండొచ్చు. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తికి భార్య అయిన సుధామూర్తి దాతృత్వంలోనూ ముందుంటారు. మూర్తి ట్రస్ట్‌కు ఛైర్‌పర్సన్‌గా ఆమె ఉన్నారు. పలు పుస్తకాలు కూడా రాశారు. నారాయణ మూర్తికి ఇన్ఫోసిస్‌లో 1.66 కోట్ల షేర్లు ఉన్నాయి. వీటి విలువ సుమారుగా రూ.2,691 కోట్లు. 2006లో పద్మశ్రీ పురస్కారం అందుకున్న సుధామూర్తికి.. ఈ ఏడాది జనవరిలో పద్మభూషణ్ పురస్కారమూ లభించింది. బ్రిటన్ ప్రధాన మంత్రి రిషి సునాక్ భార్య అక్షతామూర్తి ఈమె కుమార్తె. 'సుధామూర్తిని రాజ్యసభకు రాష్ట్రపతి నామినేట్ చేయడం సంతోషంగా ఉంది. సామాజిక కార్యకలాపాలు, దాతృత్వం, విద్య.. ఇలా పలు విభాగాల్లో ఆమె అందించిన సేవలు స్ఫూర్తివంతం. రాజ్యసభ సభ్యురాలిగా దేశ భవిష్యత్తును మార్చడంలో నారీశక్తికి నిదర్శనంగా ఆమె తన వంతు పాత్ర పోషిస్తారని ఆశిస్తున్నాను' అని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా సుధామూర్తికి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశానికి సేవ చేసేందుకు తనకు ఈ అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు అంటూ ఆమె ఎక్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా బదులిచ్చారు. పలు పుస్తకాలు కూడా రాశారు. నారాయణ మూర్తికి ఇన్ఫోసిస్‌లో 1.66 కోట్ల షేర్లు ఉన్నాయి. వీటి విలువ సుమారుగా రూ.2,691 కోట్లు. 2006లో పద్మశ్రీ పురస్కారం అందుకున్న సుధామూర్తికి.. ఈ ఏడాది జనవరిలో పద్మభూషణ్ పురస్కారమూ లభించింది. బ్రిటన్ ప్రధాన మంత్రి రిషి సునాక్ భార్య అక్షతామూర్తి ఈమె కుమార్తె. 'సుధామూర్తిని రాజ్యసభకు రాష్ట్రపతి నామినేట్ చేయడం సంతోషంగా ఉంది.

# బ్యాండ్ల వేలానికి తేదీ ఖరారు



**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం మొబైల్ ఫోన్ సేవల కోసం నిర్దేశించిన స్పెక్ట్రమ్ బ్యాండ్ల వేలాన్ని మే 20న ప్రారంభించనుంది. వీటి ప్రాథమిక ధరను రూ.96,317.65 కోట్లుగా నిర్ణయించింది. వేలానికి దరఖాస్తులను ఆహ్వానిస్తూ టెలికాం విభాగం ఇటీవల నోటీసు జారీ చేసింది. దివాలా ప్రక్రియలో ఉన్న కంపెనీల వద్ద ఉన్న స్పెక్ట్రమ్‌ను వేలానికి పెట్టనున్నారు. అదే సమయంలో కొన్ని టెలికాం కంపెనీల వద్ద ఉన్న స్పెక్ట్రానికి ఈ ఏడాది గడువు తీరనుండడంతో ఆ ఫ్రీక్వెన్సీలనూ ఈ వేలంలో జత చేయనున్నారు. దీంతో ప్రస్తుతం 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెర్ట్జ్‌తో పాటు 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్ అందుబాటులోకి వచ్చింది. దరఖాస్తులకు చివరి తేదీ ఏప్రిల్ 22గా నిర్ణయించారు. తుది బిడ్డర్ల జాబితా మే 9న విడుదల చేస్తారు. నమూనా వేలం మే 13, 14 తేదీల్లో నిర్వహిస్తారు. వాస్తవ వేలాన్ని మే 20 నుంచి చేపడతారు. బిడ్డింగ్‌ను వేలంలో గెలుచుకున్నవారికి 20 ఏళ్ల పాటు స్పెక్ట్రమ్ కేటాయిస్తారు. 20 సమాన వార్షిక వాయిదాల్లో ఇందుకు చెల్లింపులు చేయాలి. దీనికి వడ్డీ రేటు 8.65 శాతంగా నిర్ణయించారు. కనీసం 10 ఏళ్ల అనంతరం స్పెక్ట్రమ్ సరెండర్ అవకాశం ఇస్తారు. ఈసారి వేలంలో స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీలు(ఎస్‌యూసీ) లేవు. బ్యాంకు హామీలనూ సమర్పించాల్సిన అవసరం లేదు. దివాలా ప్రక్రియలో ఉన్న కంపెనీల వద్ద ఉన్న స్పెక్ట్రమ్‌ను వేలానికి పెట్టనున్నారు. అదే సమయంలో కొన్ని టెలికాం కంపెనీల వద్ద ఉన్న స్పెక్ట్రానికి ఈ ఏడాది గడువు తీరనుండడంతో ఆ ఫ్రీక్వెన్సీలనూ ఈ వేలంలో జత చేయనున్నారు. దీంతో ప్రస్తుతం 800, 900, 1800, 2100, 2300, 2500, 3300 మెగాహెర్ట్జ్‌తో పాటు 26 గిగాహెర్ట్జ్ బ్యాండ్ స్పెక్ట్రమ్ అందుబాటులోకి వచ్చింది. దరఖాస్తులకు చివరి తేదీ ఏప్రిల్ 22గా నిర్ణయించారు.

## భట్టి ఎఫెక్ట్...

# యాదగిరిగుట్ట ఆలయ ఈవోపై బదిలీ వేటు



హైదరాబాద్ : యాదగిరిగుట్టలో ప్రొటోకాల్ వివాదంలో ప్రభుత్వం అలర్ట్ అయింది. ఆలయ ఈవో రామకృష్ణారావుపై ప్రభుత్వం బదిలీ వేటువేసింది. యాదాద్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో ఆలయ ఈవో రామకృష్ణ ప్రొటోకాల్ పాటించలేదన్న ఆరోపణలతో దేవాదాయ ధర్మాదాయ శాఖ బదిలీ చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సరేఖ పట్ల అమర్యాదగా వ్యవహరించడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చే సమయంలో మిగతా మంత్రుల కంటే కాస్త తక్కువ ఎత్తున్న స్టూల్‌పై డిప్యూటీ సీఎంను కూర్చోబెట్టారు. దీంతో ఉపముఖ్యమంత్రికి అవమానం అంటూ పెద్ద ఎత్తున దుమారం రేపింది. ఇదే అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సైతం స్పందించారు. అవమానం లాంటిది ఏమీ లేదని... తానే కింద కూర్చున్నానని చెప్పుకొచ్చారు. అయినా నష్ట నివారణ చర్యల్లో భాగంగా ఆలయ ఈవోపై చర్యలు తీసుకున్నారు. కాగా, మరోవైపు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా యాదగిరిగుట్ట దేవస్థాన అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే పది సమాంతర పీఠలను ఆలయ సిబ్బంది కొనుగోలు చేసింది. పాతవి 4, కొత్తవి 10 పీటలతో సహా ఒకేసారి 14 మంది వీవీఐపీలకు వేద ఆశీర్వచనం చేసేలా దేవస్థాన అధికారులు చర్యలు చేపట్టింది.

# అమెరికాలో హిందూఫోబియా పెరుగుతోంది : చట్టసభ ప్రతినిధి థానేదార్

వాషింగ్టన్: అమెరికాలో హిందువులకు వ్యతిరేకంగా దాడులు పెరుగుతున్నట్లు ఆ దేశానికి చెందిన చట్టసభ ప్రతినిధి థానేదార్ తెలిపారు. హిందూఫోబియా కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని, ఈ దేశంలో ద్వేషానికి చోటు లేదని ఆయన అన్నారు. బుధవారం క్యాపిటల్ హిల్‌లో కొన్ని హిందూ గ్రూపులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. హిందువుల పట్ల జరుగుతున్న విద్వేష నేరాలను అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆలయాలపై దాడులు పెరుగుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులను కూడా టార్గెట్ చేస్తున్నారని, అందుకే హిందూ కాకస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు థానేదార్ తెలిపారు. అమెరికా కాంగ్రెస్ చరిత్రలో తొలిసారి హిందూ కాకస్ ఏర్పడిందని, మతస్వేచ్ఛ ఉండాలన్న ఉద్దేశంతో ఆ కాకస్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మత వ్యతిరేకత, ద్వేషంపై ఫైట్ చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికాలో ద్వేషం ఉండవద్దు అని, మతపరమైన హక్కులను గౌరవించాలన్నారు. కాలేజీ క్యాంపస్‌ల్లో ఎక్కువ శాతం హిందూ వ్యతిరేక దాడులు జరుగుతున్న హిందూ అమెరికన్ ఫౌండేషన్




నేత సుహాగ్ శుక్లా తెలిపారు. గడిచిన రెండేళ్లలో హిందూ వ్యతిరేక దాడుల సంఖ్య పెరిగిందన్నారు. ఖలిస్తానీ దాడులు కూడా పెరుగుతున్నట్లు ఆమె చెప్పారు.

# త్వరలో పార్శిళ్లు ఇంటి వద్దనే పికప్, డెలివరీ : ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్



హైదరాబాద్ : ప్రత్యామ్నాయ ఆదాయం పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో లాజిస్టిక్స్ విభాగ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ) ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. వినియోగదారులకు వేగవంతమైన సేవలందించేందుకు త్వరలోనే పార్శిళ్లను ఇంటి వద్దనే పికప్, డెలివరీ చేస్తామని ఆయన చెప్పారు. హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టేషన్ ప్రాంగణంలో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ మోడల్ కౌంటర్‌ను ప్రారంభించారు. కొత్త కౌంటర్ లో ఒక పార్శిల్ ను బుకింగ్ చేసి రశీదును వినియోగదారుడు శివ కుమార్‌కు ఆయన అందజేశారు. అనంతరం లాజిస్టిక్స్ విభాగ కొత్త లోగో, బ్రోచర్ ను ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ఆవిష్కరించారు. పార్శిళ్ల హోం పికప్, డెలివరీ కోసం వినియోగించే కొత్త వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ విభాగం తెలంగాణలో అతివేగంగా పార్శిళ్లను డెలివరీ చేసే వ్యవస్థ అని అన్నారు. ప్రతి రోజు సగటున 15 వేల పార్శిళ్లను బట్వాడా చేస్తున్నామని తెలిపారు. ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకోవాలని నిర్ణయించిన సంస్థ.. ప్రైవేట్ మార్కెట్‌కు ధీటుగా లాజిస్టిక్స్ విభాగాన్ని బలోపేతం చేస్తున్నదని తెలిపారు. లాజిస్టిక్స్ సేవలకు సంబంధించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్ నంబర్ 040-69440069 గానీ, https://www.tsrtclogistics.in వెబ్‌సైట్‌ను గానీ సంప్రదించవచ్చని సూచించారు.

# ఆర్మీ మేజర్, 16 మంది జవాన్లపై దాడి.. ధాబా యజమాని, మరో ముగ్గురు అరెస్ట్

చండీగఢ్: ఆర్మీ మేజర్, 16 మంది జవాన్లపై సుమారు 35 మంది దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ధాబా యజమానితో సహా నలుగురిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం వెతుకుతున్నారు. పంజాబ్‌లోని రోపార్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. లడఖ్ స్కౌట్స్‌కు చెందిన మేజర్ సచిన్ సింగ్ కుంతల్, 16 మంది సైనికులు ఆదివారం లాహౌల్‌లో జరిగిన స్నో మారథాన్‌లో పాల్గొని విజయం సాధించారు. అనంతరం తిరిగి వస్తున్న వారు సోమవారం రాత్రి వేళ మనాలి-రోపర్ రహదారిలోని భరత్‌ఘడ్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న 'ఆల్‌పైన్ ధాబా' వద్ద ఫుడ్ కోసం ఆగారు. కాగా, ఆహారం తిన్న తర్వాత యూపీఐ ద్వారా బిల్లు చెల్లిస్తామని ఆర్మీ మేజర్, జవాన్లు తెలిపారు. అయితే క్యాష్ ఇవ్వాలని ధాబా యజమాని డిమాండ్ చేశాడు. ఆర్మీ మేజర్ ఆన్‌లైన్‌లో బిల్లు చెల్లించడంతో ధాబా యజమాని వాగ్వాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో ధాబాకు చెందిన సుమారు 35 మంది వ్యక్తులు ఆర్మీ మేజర్, 16 మంది జవాన్లపై దాడి చేశారు. ముఖంపై పంచ్‌లు ఇవ్వడంతో పాటు కర్రలు, ఇనుప రాడ్లతో వారిని కొట్టారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. మరోవైపు ఈ దాడిలో ఆర్మీ మేజర్ తీవ్రంగా గాయపడి సొమ్మసిల్లి పడిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆర్మీ



మేజర్, సైనికులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దాబా యజమాని, మేనేజర్‌తో సహా నలుగురిని అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిఎఎ రాజ్యాంగ వ్యతిరేకమైంది: కేరళ సిఎం విజయన్



పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) రాజ్యాంగ వ్యతిరేకం, పౌరుల హక్కులకు వ్యతిరేకమైందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. ఇది భారత దేశ స్ఫూర్తికి వ్యతిరేకమని ఆయన అన్నారు. గురువారం ఇక్కడ విజయన్ విలేఖరులతో మాట్లాడుతూ,ఈ వివాదాస్పద చట్టం మత వివక్షకు చట్టబద్ధతను మంజూరు చేస్తుందని విమర్శించారు. అంతేకాదు సిఎఎకు వ్యతిరేకంగా ఏర్పడిన ఐక్యఫ్రంట్‌నుంచి కాంగ్రెస్ వైదొలగిందని కూడా ఆయన ఆరోపించారు. 2019లో పార్లమెంటులో ఆమోదం పొందిన పౌరసత్వ సవరణ చట్టానికి రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా లభించింది. అయితే పలు కారణాల వల్ల అప్పటినుంచి అమలు కాకుండా ఉన్న ఈ చట్టాన్ని లోక్‌సభ ఎన్నికలకు ముందు అమలు చేయనున్నట్లు మోడీ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పలు ప్రతిపక్ష పార్టీలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో దీన్ని అముల చేయబోమని తృణమూల్ పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఇప్పటికే ప్రకటించారు. అంతేకాకుండా అసోం సహా అనేక ప్రాంతాల్లో దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు కూడా జరుగుతున్న విషయం తెలిసిందే.

# శక్తి టీమ్ పురస్కారాన్ని సాధించిన దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళం



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళానికి మహిళల రక్షణ కేటగిరీ కింద అవార్డును ప్రధానం చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు -2024లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు , సీనియర్ సిటిజన్ల విభాగంచేత గురువారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో 'మహిళల రక్షణ కేటగిరీ'లో దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళానికి శక్తి టీం పురస్కారం ప్రధానం చేసింది. తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే ఐజి కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్‌ను అభినందించి రూ 1 లక్ష బహుమతి, ఒక మెమెంటోతో కూడిన అవార్డు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ అవార్డు ప్రదానోత్సవంలో సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మితా చటోపాధ్యాయ, రైల్వే రక్షణ దళానికి చెందిన మహిళా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సంధర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమీషనర్ అరుమా సింగ్ ఠాకూర్‌లు ఈ మేరకు 24 గంటలూ మహిళా ప్రయాణీకులకు భద్రత కల్పిస్తున్న దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ బృందాన్ని అభినందించారు. బృందం ప్రదర్శించిన ధైర్యసాహసాలు చురుకుదనాన్ని ఆయన ప్రశంసిస్తూ ఇటువంటి చర్యల వలన మన రైల్వే రక్షణ దళం యొక్క ధైర్యాన్ని పెంపొందించడమే కాకుండా ఇతర రైల్వే సిబ్బందిని కూడా అలాంటి ప్రయత్నాలను చేపట్టేలా ప్రోత్సహిస్తుందని తెలియజేశారు. దక్షిణ మధ్య రైల్వేకు టీమ్ సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం ద్వారా ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు మరియు అవార్డును అందుకోవడం జోన్ కు గర్వంగా ఉందని తెలియజేశారు. కాగా దక్షిణ మధ్య రైల్వే మహిళా రైల్వే రక్షణ దళంకు చెందిన శక్తి బృందం రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పిఎఫ్) మహిళా రైల్వే ప్రయాణికుల భద్రతను పెంపొందించేందుకు కృషి చేస్తోంది. దక్షిణ మధ్య రైల్వే వ్యవస్థలో నడిచే రైళ్లలో ప్రయాణించే మహిళలు మరియు పిల్లల భద్రత కోసం విధులను నిర్వర్తిస్తున్న శక్తి బృందాన్ని 'రుద్రమ్మ' మరియు 'నాగమ్మ' పేరుతో రెండు బృందాలుగా ఏర్పాటు చేశారు . ఈ బృందాలు ప్రయాణిస్తున్న చాలామంది మహిళలకు సహాయం మరియు భద్రతను కలుగజేస్తున్నాయి. ఈ టీమ్లు నిరంతరం నడుస్తున్న రైళ్లలో మరియు రైల్వే స్టేషన్లలో ఉండడంతో పాటు ఆకస్మిక తనిఖీ కార్యకలాపాలను కూడా నిర్వహిస్తాయి. బృంద సభ్యులు ప్రయాణీకులుగా ప్రవర్తిస్తూ ఎవరైనా నేరం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు లేదా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లుగా ఉన్న వారిని గమనించినట్లయితే నేరస్థులను రెడ్ హ్యాండెడ్గా పట్టుకుంటారు. భారతీయ రైల్వేలో శక్తివంతమైన రైల్వే జోన్గా దక్షిణ మధ్య రైల్వే రైలు ప్రయాణీకులకు అత్యుత్తమ భద్రతను అందించడంలో గర్విస్తుంది.




## టెట్ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

# డీఎస్సీ కంటే ముందుగానే పరీక్ష

హైదరాబాద్: డీఎస్సీ-2024 కంటే ముందుగానే టీచర్ అర్హత పరీక్ష ( టెట్ ) నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు విద్యా శాఖ కమిషనర్‌కు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 3 లక్షల మంది అభ్యర్థులకు డీఎస్సీ రాసే అవకాశం దక్కనుంది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల 11,062 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ-2024ను ప్రకటించింది. మార్చి 4వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నది. అయితే.. టెట్ నిర్వహించిన తర్వాతనే డీఎస్సీ నిర్వహించాలని డీఈడీ, బీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగులు కోరారు. ఉద్యోగార్థులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కూడా టెట్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై మాజీ మంత్రి హరీశ్‌రావు.. సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ కూడా రాశారు. టెట్ నిర్వహించక పోవడం వల్ల ప్రస్తుతం విడుదలైన డీఎస్సీ-2024 ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అర్హతను అనేకమంది కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిరుడు సెప్టెంబర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం టెట్ నిర్వహించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టెట్ నిర్వహించలేదని పేర్కొన్నారు. గత డిసెంబర్‌లో డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు దాదాపు 50 వేల మంది ఉన్నారని వివరించారు. టెట్ నిర్వహిస్తే ఇందులో అర్హత సాధించిన వారందరూ డీఎస్సీ దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. డీఈడీ, బీఈడీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం.. డీఎస్సీ కంటే ముందుగానే టెట్ నిర్వహించాలని నిర్ణయించింది.



# 18 ఓటిటి ప్లాట్‌ఫారాలపై వేటు



అసభ్య, అశ్లీల, కొన్ని సందర్భాలలో పోర్నోగ్రఫీ కంటెంట్‌ను ప్రచురణ, ప్రసారం చేస్తున్న 18 ఓటిటి ప్లాట్‌ఫారాలపై కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ గురువారం వేటు వేసింది. వాటిని బ్లాక్ చేయాలని ఆదేశించింది. ఈ ప్లాట్‌ఫారాలతో సంబంధం ఉన్న 19 వెబ్‌సైట్లు, 10 యాప్‌లు(ఏడు గూగుల్ ప్లే స్టోర్‌లో 3 యాపిల్ యాప్ స్టోర్‌లో), 57 సోషల్ మీడియా అకౌంట్లను భారత్‌లో అందుబాటులో లేకుండా డిజేబుల్ చేసినట్లు కేంద్రం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com